

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక
RNI-APTEL/2023/88162
GSTIN 37AMRPM5719R1ZX

**అసత్య ప్రచారాలు మానండి**



లేకుంటే ఉద్యోగాలు పొందిన టీచర్లే బుద్ధి చెబుతారు

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 216 | మంగళవారం 11- 08 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028

## వర్షాల కోసం వరుణ యాగం..

**తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం**
**నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు**
**ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు**
**యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం**



రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా

## విద్యార్థుల నిరసనలపై అమిత్ షా మాట్లాడతారు..



ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలపై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సమాధానం ఇవ్వనున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చకు సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం ప్రకటించారు.

**విద్యార్థులపై పోలీసుల చర్యపై**
**పార్లమెంట్‌లో మాట్లాడనున్న అమిత్ షా**
**ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చకు**
**సిద్ధమైనట్లు ప్రభుత్వం ప్రకటన**
**ప్రతిపక్షాలు గందరగోళం**
**చేయొద్దని రిజిజు విజ్ఞప్తి**
**జూన్ 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసన**
**వారిపై పోలీసుల చర్యలను తీవ్రంగా**
**తప్పుబట్టిన ప్రతిపక్షాలు**
**పెల్లెట్ గన్స్ వాడినట్లు వచ్చిన**
**వార్తలపై అభ్యంతరం**




## లోకేష్.. రైజింగ్ స్టార్ !

ఫార్చ్యూన్ ఇండియా పత్రికలో మంత్రి నారా లోకేశ్‌పై వ్యాసం కోసం కోటి రూపాయలకుపైగా ప్రభుత్వ ధనం ఖర్చు చేశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వం స్పష్టం చేసింది. లోకేశ్‌పై తప్పుడు ప్రచారాన్ని ఖండించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జీవోకు, ఫార్చ్యూన్ ఇండియా కథనానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 18-1-2025న జారీ చేసిన జీవో.. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీ పెట్టుబడి అవకాశాల ప్రచారం కోసం ఇచ్చిందని.. ఓ ఆంగ్ల ఛానల్‌కు చెల్లింపులు చేయాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాలే ఆ జీఓలో ఉన్నాయని ఏపీ సర్కార్ వెల్లడించింది. ఫార్చ్యూన్ ఇండియా, సిఎన్‌బిసి టివి రెండు వేర్వేరు సంస్థలని.. రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని సర్కార్ వివరణ ఇచ్చింది. జీవోను వక్రీకరించి మంత్రి నారా లోకేశ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ప్రజలకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించడం నేరమని హెచ్చరించింది. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు

**ఫార్చ్యూన్ ఇండియాలో లోకేశ్‌పై కథనం**
**కోటి ఖర్చు చేశారన్న ప్రచారం ఖండించిన ప్రభుత్వం**

## డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకెళ్తున్నాం

**వైకాపాలా కాకుండా అభివృద్ధికే పెద్దపీట వేస్తున్నాం**
**రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను కఠినంగా అణిచివేస్తాం**
**కలిదిండి సభలో సిఎం చంద్రబాబు ఉద్ఘాటన**



డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకెళు‌_న్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సోమవారం ఏలూరు జిల్లాలోని కలిదిండిలో 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజల ఉత్సాహం చూస్తూంటే, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏదే విజయమనిపిస్తోందని తెలిపారు.

## మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

**కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోదీ అభినందనలు**



దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోదీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం

### డీఎస్పీ అక్రమాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ నిరసన

**పలు చోట్ల లాఠీఛార్జీలు**
**చేయడంపై ఆందోళన**
**ఎక్కడిక్కడే నేతలను**
**అడ్డుకున్న పోలీసులు**



## అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

**అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు**
**హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ**



## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

**గోవింద నామాలను పేరడీ చేయడంపై**
**పవన్ కల్యాణ్ ఆగ్రహం**
**నెల్లూరులో ఓ పార్టీ చర్యను తీవ్రంగా**
**ఖండించిన జనసేనాని**
**భక్తుల మనోభావాలను కించపరిచే**
**కుట్రపూరిత చర్యగా అభివర్ణన**
**ఈ ఘటనపై చట్టపరంగా**
**ముందుకెళ్లాలని పార్టీ నేతలకు ఆదేశం**
**దైవ నామాలను అపహాస్యం కోసం**
**వాడొద్దని హితవు**



# ఝార్ఖండ్‌లో టెన్షన్..

## బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు..



**ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం**
**బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్**
**అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు**
**పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు**
**13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్**

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది



**ప్రజల అభిమానం చూరగొన్న నేత**
**నర్సంపేట కాలేజీఇకి పెద్ది పేరు పెడతాం**
**సంతాపసభలో కేటిఆర్ వెల్లడి**

ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు.

## నేతన్నలందరికీ ఆర్థిక సాయం

**మిగిలిన వారికి త్వరలో అందచేస్తాం**
**మంత్రి సవిత వెల్లడి**

సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేతన్నల సేవలో పథకానికి ఇటీవలే శ్రీకారం చుట్టామని మంత్రి సవిత తెలిపారు.



## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

**యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన**



## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

### ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?




## తమిళనాడు రాష్ట్ర గీతంపై అసెంబ్లీ తీర్మానం..

**అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం విజయ్**



## డీఎస్సీ అక్రమాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ నిరసన

డీఎస్సీ అక్రమాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు కూటమి ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ర్యాలీలను అడ్డుకోవడం, నేతలను అదుపులోకి తీసుకోవడం.. పలు చోట్ల లాఠీఛార్జీలు చేయడంపై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నిరసనలను అడ్డుకోవడం చంద్రబాబు ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. డీఎస్సీ నియమకాల్లో జరిగిన అవినీతికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయడం, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ అభ్యర్థులు, డీఎస్సీ సంఘాలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ర్యాలీలు, నిరసనలకు అనుమతి లేదంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. పులివెందులలో పోలీసులు దౌర్జన్యకాండకు పాల్పడ్డారు. పులివెందులలో ఆర్డీవోకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై లాఠీ ఛార్జ్ చేశారు. దీంతో పలువురికి గాయాలు కాగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు వినిపించాయి. అంతకు ముందు.. ఎంపీ అవినాశ్‌రెడ్డికి ర్యాలీ నిర్వహించడానికి వీల్లేదంటూ పోలీసులు నోటీసులు అందించారు. చీపురుపల్లిలో నిర్వహించాల్సిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న సీనియర్ నేత, మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణను పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుకోవడం సరికాదని బొత్స మండిపడ్డారు. రోడ్డుపైనే ఆయన ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి కొడాలి నానిని గుడివాడ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. డీఎస్సీ అంశంపై నిరసనల్లో పాల్గొనకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ పరిణామంపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఆయన అభిమానులు మండిపడుతున్నారు. అటు రాజమండ్రిలోనూ మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యంలో నిరసనలు జరుగుతుండగా.. పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. విశాఖపట్నంలోని మారియట్ సెంటర్ వద్ద నిరసనకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. కేకే రాజు సహా పలువురిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. విజయవాడలో దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనుమతి లేదంటూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు బారికేడ్లు దాటేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అవనిగడ్డలోనూ వైఎస్సార్‌సీపీ నేతల నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సమస్యలపై గొంతెత్తే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించింది. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో.. గన్నవరంలో వల్లభనేని వంశీ ఆధ్వర్యంలో ర్యాలీలు జరుగుతున్నాయి. నెల్లూరు, కర్నూల్, అనంతపురం, అవనిగడ్డ.. ఇలా పలు చోట్ల వైఎస్సార్‌సీపీ ర్యాలీలు నిర్వహించకుండా పోలీసులు అడ్డుపడుతున్నారు. నిరసన తెలియజేస్తున్న వాళ్లపైకి లాఠీ ప్రయోగిస్తున్నారు. డీఎస్సీ అంశంపై శాంతియుతంగా ర్యాలీలు నిర్వహిస్తే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, దాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు.

## మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని ల్వ్లీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోదీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

## అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్టంభన కొనసాగుతుంది' అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

## ఝార్ఖండ్‌లో టెన్షన్..

ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

**16 రోజులుగా ఆందోళన**ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది

వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

## నేతన్నలందరికీ ఆర్థిక సాయం

సోమవారం రాష్ట్ర సచివాలయంలో నేతన్నల సేవలో పథకంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకా మిగిలిపోయిన అర్హులను గుర్తించి అందరికీ రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందించామన్నారు. ఇంకా మిగిలిన అర్హులైన నేతన్నలకు కూడా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. 13,678 మంది నేతన్నల సేవలో పథకానికి దరఖాస్తులు చేసుకున్నారని.. వారిలో అర్హులను గుర్తించి నేతన్నల నేస్తం పథకం వర్తింపజేస్తామని వెల్లడించారు. వారం రోజుల్లో మిగిలిపోయిన అర్హులకు కూడా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి అన్నారు. నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. 50 ఏళు నిండిన 85,678 మంది చేనేతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. 62,541 మందికి నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ సమీక్షలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారులకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు. గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు. భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

### ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రతిపక్ష హోదా వివాదం నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్ట్ 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఎల్ఓపీ హోదా కల్పించనంత వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది.

## లోకేష్ రైజింగ్ స్టార్!

తీసుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. తప్పుడు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఏపీ ప్రభుత్వం స్పష్టీకరించింది.

## వర్షాల కోసం వరుణ యాగం..

ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

### విద్యార్థుల నిరసనలపై అమిత్ షా మాట్లాడతారు.. పార్లమెంట్‌లో కేంద్రం హామీ

దీంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్ఠంభనకు తెరపడే అవకాశం కనిపిస్తోంది. విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రిజిజు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశానికీ ప్రభుత్వం సమాధానం ఇస్తుందని చెప్పారు. ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా సభలో ఈ అంశంపై స్పందిస్తారని స్పష్టం చేశారు. అయితే అమిత్ షా ప్రకటన సమయంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించకూడదని రిజిజు కోరారు. హోంమంత్రి సమాధానాన్ని పూర్తిగా వినాలని సూచించారు. చర్చ మొదలైన తర్వాత ప్రతి అంశంపైనా విస్తృతంగా మాట్లాడవచ్చని చెప్పారు. జూన్ 20న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నిరసనపై పోలీసులు తీసుకున్న చర్యలను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. విద్యార్థులపై పోలీసులు అతిగా వ్యవహరించారని ఆరోపిస్తున్నాయి. పెల్లెట్ గన్స్ వాడినట్లు వచ్చిన వార్తలపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ చర్యలు అమిత్ షా ఆదేశాలతో జరిగాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అమిత్ షా నుంచి సమాధానం కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభలో వరుసగా నిరసనలు చేపడుతున్నారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే నినాదాలతో కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ గేట్ల వద్ద కూడా ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి.

## డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకెళ్తున్నాం

అటు కేంద్రం, ఇటు రాష్ట్రం డబుల్ ఇంజన్ స్పీడుతో ముందుకు పోతున్నామని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పనులు పూర్తి చేసి ఆనందం పడుతుంటే.. గొడ&ఢలి పార్టీ ఏం చేస్తుందో చూస్తున్నామని అన్నారు. జగన్ బాబాయ్ వివేకానందరెడ్డిని చంపి, ఆ నేరం తనపై నెట్టి నారాసుర రక్త చరిత్ర అని పేపర్‌లో వేశారని ఆగ్రహించారు. రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను అణిచివేస్తామని హెచ్చరించారు. ఒకప్పుడు కరెంటు లేని పరిస్థితి నుంచి ఈ రోజు సోలార్ పవర్ తయారు చేసుకునే పరిస్థితికి వచ్చామని తెలిపారు. ఏపీని స్వర్ణాంధ్రగా మార్చే క్రమంలో అడ్డు వచ్చేవారికి సహాయ నిరాకరణ చేయాలని అన్నారు. ఈ ఏడాది 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఆ రోజు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చడానికి ఒక సంకల్పం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొల్లేరు విషయంలో అన్ని విషయాలు జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్వాతంత్య్రం రాకముందు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న వారికి పట్టాలు ఇచ్చారని ప్రస్తావించారు. అప్పటి సమస్యలు ఇప్పుడు పరిష్కారించామని సీఎం వెల్లడించారు. ఇంతకన్నా రాజకీయ జీవితంలో కావాల్సినదేముందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల్లో ఎవరి ఫొటో వేసుకోడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో వారు భూములు అడిగితే, ప్రజలు ఇవ్వకపోతే, ఆ భూములను 22ఏ లో పెట్టి ఇబ్బందులు పెట్టారని ధ్వజమెత్తారు. ఆయా సమస్యలు పరిష్కరిస్తే, ప్రజలు జేజేలు కొడతారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే 151 సీట్ల పార్టీ ఏమైందో ప్రజలు చూశారని సీఎం చంద్రబాబు అన్నారు. తాను కూడా బటన్ నొక్కవచ్చని, పరదాల చాటున రావచ్చని, విమానంలో తిరిగి వెళ్లిపోవచ్చని కానీ జగన్ లాగా తాను చేయనని తెలిపారు. ఇలా చేస్తే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయా అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 7700 గ్రామాల్లో 32 లక్షల 32 వేల పాస్ పుస్తకాలు ఇచ్చామని ప్రస్తావించారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఉపయోగించి పాస్ పుస్తకాలు చేయించామని తెలిపారు. దానిలోని వివరాలు ఎవరు మార్చలేరని అన్నారు. 9365 గ్రామాల్లో 68 లక్షల 64వేల పాస్ పుస్తకాలు ఇవ్వాలని తెలిపారు. రాబోయే ఏడు నెలల్లో వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను అణిచివేస్తామని సీఎం వార్నింగ్ ఇచ్చారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ గౌరవప్రదమైన కార్యక్రమమని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి ఒక్కరి ఆత్మగౌరవానికి సంబంధించిన కార్యక్రమమని చెప్పారు. కోటి మందికి పట్టాలు ఇచ్చేటప్పుడు అవినీతి జరుగుతుందని.. అది జరగకుండా ఉండాలనే గ్రామసభల్లో ఇచ్చామని ప్రస్తావించారు. ప్రజలు కూడా కుటుంబ వివాదాలు తగ్గించుకుని, లిటిగేషన్లు లేకుండా చూడాలని సూచించారు. తాను నాలుగోసారి సీఎంగా చేస్తున్నానని.. సీఎం పదవి తనకు కొత్తమే కాదని చెప్పారు. అప్పటికన్నా స్పీడు పెంచానని తెలిపారు. టెక్నాలజీ కూడా పెంచామని వెల్లడించారు. ఈ జిల్లాలో ఎక్కడ చూసినా చేపల చెరువులు ఉంటాయని ప్రస్తావించారు.. తాగునీరు మాత్రం ఉండదని చెప్పారు. కైకలూరులో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.36 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. సూపర్ సిక్స్ అమలు చేశామని స్పష్టం చేశారు. గుంతలు లేని రోడ్లపై సజావుగా ప్రయాణం చేసేలా చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే గడ్డు పరిస్థితులు అధిగమిస్తూ, ముందుకు పోతున్నామని చెప్పారు. ప్రపంచం అంతా ఆహారపు అలవాట్లు మారుతున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు.. భవిష్యత్తు అంతా ఆక్వారంగానిదే అని ఆనాడే చెప్పామని ప్రస్తావించారు. ఆక్వారంగాన్ని ఆదుకోవడానికి రూపాయిన్నరకే కరెంటు ఇచ్చామని తెలిపారు. వైసీపీ హయాంలో జోన్, నాన్ ఆక్వా జోన్ అని చెప్పి ఆక్వారంగాన్ని ఇబ్బంది పెట్టారని ధ్వజమెత్తారు. ఏపీలో ఒక దౌర్భాగ్య పార్టీ ఉందని.. అదే గొడ్డలి పార్టీ అని విమర్శించారు. తన 48 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో సమస్యలు చూశామని ప్రస్తావించారు. అప్పట్లో నక్సలైట్ల సమస్య ఉండేదని చెప్పారు. తాను వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తుంటే, 23 క్లామోర్‌మైన్స్ పెట్టి చంపాలని చూశారని అన్నారు. తాను భయపడలేదని.. తాను ప్రజలకు చేసిన మంచి తనను కాపాడుతుందని భావించానని అన్నారు. రాయలసీమ రాజకీయ ముఠా కక్ష్యలు .. లేకుండా చేయాలని గట్టిగా తాము నిర్ణయించుకున్నామని.. వాటిని లేకుండా చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో గతంలో మత కక్ష్యలను రెచ్చగొట్టి, ఆరునెలలు కర్ఫ్యూ ఉండే పరిస్థితి ఉండేదని సీఎం చంద్రబాబు చెప్పారు. 2019 నుంచి 2024 వరకు గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లు ఉండేవని, రౌడీయిజం చెలాయించేవారని అన్నారు. రౌడీయిజాన్ని పూర్తిగా అరికట్టామని స్పష్టం చేశారు. కొంతమంది పొగాకు రైతులు మంచి రేటు వస్తుందని ఎక్కువగా పంట వేశారని తెలిపారు. దానివల్ల రేటు తగ్గిందని.. తాము కేంద్రప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. దేవరపల్లిలో రైతులను పరామర్శించడానికి జగన్ వచ్చారని.. రైతుల పంటను తొక్కేశారని ఆగ్రహించారు. చొక్కాలు విప్పి విన్యాసాలు చేశారని.. బైకులతో జనాలను ఢీకొట్టారని మండిపడ్డారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇవ్వకుండా 356 పిటిషన్లు వేశారని దుయ్యబట్టారు. కష్టపడి చదివిన వారికి ఉద్యోగాలు ఇస్తే.. సంవత్సరం తర్వాత వైసీపీ వారు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారని ఆగ్రహించారు. వైసీపీకి వ్యతిరేకంగా కర్నూలులో ఆందోళన చేశారని.. అయినా వారికి సిగ్గుండాలని విమర్శించారు. ఈ రోజు మళ్లీ ఆందోళన చేస్తున్నారని మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయాన్ని తమ ప్రభుత్వం పూర్తి చేస్తే.. తామే చేశామని వైసీపీ నేతలు ఇప్పుడు చెప్పడం విడ్డూరంగా ఉందని సీఎం ఎద్దేవా చేశారు. పోలవరం, అమరావతి పూర్తి అయితే అది తామే చేశామంటారని విమర్శించారు.

# కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యం

**మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు**

**'శ్రీ గోడల ఆంజనేయ స్వామి నగర్' సమస్యలపై స్పందన**

**అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కాలనీవాసుల విజ్ఞప్తి**

**సమస్యల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు**

**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీ గోడల ఆంజనేయ స్వామి నగర్ (కాలనీ) లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, కాలనీ సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని నగర పాలక సంస్థ (మున్సిపల్) కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. సోమవారం కాలనీ ప్రతినిధులు కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో నేరుగా కలసి, కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు తీవ్రమైన మౌలిక వసతుల సమస్యలపై వివరణాత్మక వినతిపత్రాన్ని అందజేశారు.

**వినతిపత్రంలోని ముఖ్యాంశాలు:**డబ్ల్యూబీఎమ్ / బీఎమ్ రోడ్ల నిర్మాణం: కాలనీలో సగానికే నిలిచిపోయిన ఔదీవీ, దీవీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పునరుద్ధరించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.కొత్త ఇంటి నెంబర్ల కేటాయింపు: నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి మున్సిపల్ పన్నులను వసూలు చేసి, తక్షణమే అధికారిక ఇంటి నెంబర్లను మంజూరు చేయాలి. వీధి దీపాల (స్ట్రీట్ లైట్లు) ఏర్పాటు: కాలనీలో వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో తీవ్ర చీకటి అలముకుంటోందని, మహిళలు, పిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నందున వెంటనే నాణ్యమైన వీధి దీపాలను ఏర్పాటు చేయాలి.పార్కు స్థలాల సంరక్షణ: కాలనీకి కేటాయించిన పార్కు స్థలాలు ఆక్రమణల (కబ్జాల) బారిన పడకుండా మున్సిపల్ యంత్రాంగం వెంటనే రక్షణ కంచె (ఫెన్సింగ్) నిర్మించి సంరక్షించాలి.



**కమిషనర్ సానుకూల స్పందన**

:కాలనీవాసుల సమస్యలను శ్రద్ధగా ఆలకించిన కమిషనర్ చల్లా ఓబులేసు అత్యంత సానుకూలంగా స్పందించారు. అర్జీలో పేర్కొన్న సమస్యలపై తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, నివేదిక ఇవ్వాలని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ మరియు ప్రజారోగ్య విభాగాధికారులను ఆదేశించారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించి, నివాసితుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు మధు, శ్రీనివాసులు, పి. నాగేంద్రుడు మరియు కాలనీ నివాసులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి






**: వైఎస్సార్‌సీపీ డిమాండ్**

**విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి**

**కర్నూలులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**

**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** డీఎస్సీ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేసింది. డీఎస్సీ అక్రమాలు, నిరుద్యోగుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వి. విజయ మనోహరి పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాలి** ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. డీఎస్సీ ప్రక్రియపై అభ్యర్థుల్లో తీవ్రమైన అనుమానాలు నెలకొన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని, అభ్యర్థులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ మేయర్ బి.వి. రామయ్య, పార్టీ నాయకులు కటిక గౌతమ్, బాలు, అన్సూర్ తదితరులతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభ్యర్థులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# శ్రీశైలం దేవస్థానంలో శాస్త్రోక్తంగా స్వామివారిని సహస్ర ఘటాభిషేకం







**నాల్గవ రోజు కొనసాగుతున్న వరుణ యాగ సహితసహస్ర ఘటాభిషేకం**

**ఈ ఉదయం విశేష పూజలతో ప్రారంభమైన ఘటాభిషేకం**

**వెయ్యికిపైగా కలశాలతో శాస్త్రోక్తంగా శ్రీమల్లికార్జునస్వామివారికి అభిషేకం...**

**విశేషపూజలలో పాల్గొన్న దేవదాయశాఖ అదనపు కమిషనరు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు, కార్యనిర్వహణాధికారి మరియు ధర్మకర్తల మండలి సభ్యులు**

**శ్రీశైలం ఆగస్టు 10 (నంది పత్రిక)** సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండి రాష్ట్రం సశ్యశ్యామలంగా ఉండాలనే సంకల్పంతో తేది :07.08.2026 నుండి 11.08.2026 వరకు 5 రోజులపాటు నిర్వహింపబడుతున్న వరుణయాగసహిత సహస్ర ఘటాభిషేక కార్యక్రమాలలో నాలుగవరోజు అయిన ( 10.08.2026) కొనసాగాయి.

ఇందులో భాగంగా ఈరోజు వేకువజామున ఏకాదశ రుద్ర ఋష్యశృంగ సహిత సహస్ర ఘటార్చన, మహాన్యాస పారాయణ, రుద్రపారాయణ, కాఠక శతానువాక పారాయణ, వేదపారాయణలు, వారుణానువాక సహిత ఋష్యశృంగ పారాయణ, రుద్రహోమం, చండీపారాయణ, శ్రీచక్రార్చాన, నవావరణార్చన విశేష కుంకుమార్చనలు జరిపించ బడుతున్నాయి. కాగా కృష్ణవేణీ పుణ్యనదీజలాలలోతోనూ ఆలయప్రాంగణములోని మల్లికాగుండ పవిత్రజలంతోనూ ఈ అభిషేకం జరిపించబడింది. కార్యక్రమములో భాగంగా ఈ నెల 07 తేదీ నుంచి ఋష్యశృంగజపం, వారుణానువాక పారాయణలు, వరుణజపం, భాగవత, విరాటపర్వ పారాయణలు పంచాక్షరీ జపాలు జరిపించబడుతున్నాయి.

దేవస్థానం అర్చకస్వాములు, వేదపండితులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సుమారు 36 మంది ఋత్వికులు ఈ కార్యక్రమములో పాల్గొంటున్నారు.ఆరుద్రోత్సవ పూజాదికాల అనంతరం ముందుగా ఈ ఉదయం అర్చకస్వాములు ఘటాభిషేక సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని, అతివృష్టి, అనావృష్టి నివారించబడాలని, రాష్ట్రంలో చెరువులు, జలాశయాలలోకి సమృద్ధిగా నీరు చేరాలని జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని పేర్కొనడం జరిగింది.సంకల్పం తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది. అనంతరం అర్చకస్వాములు పాతాళగంగ వద్ద కృష్ణవేణీనదీమతల్లికి పూజాదికాలు జరిపి కలశాలలో కృష్ణవేణీనదీ పుణ్యనదీజలాలను తీసుకురావడం జరిగింది. తరువాత అర్చకస్వాములు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, పలవురు ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు సంప్రదాయాన్ని అనుసరించి కృష్ణవేణీనదీ జలాలతో పాతాళేశ్వరస్వామివారి ఆలయంలో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. అనంతరం వీరందరూ జలకలశాలను తలపై పెట్టుకుని వేదమంత్రాల నడుమ భజంత్రీలతో నందిఆలయం వద్దకు చేరుకున్నారు. నందిగుడిలో నందీశ్వరస్వామివారికి, ఆ తరువాత గ్రామదేవత అంకాళమ్మ అమ్మవారికి అనంతరం క్షేత్రపాలకుడు వీరభద్రస్వామివారికి అభిషేకాది అర్చనలను జరిపించారు. తరువాత వీరందరూ జలకలశాలతోనే ప్రధానాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయప్రాంగణములోని అక్కమహాదేవి అలంకార మండపంలో నెలకొల్పబడిన ప్రధాన కలశాలకు, ఇతర కలశాలకు, కృష్ణవేణీనదీజల కలశాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. ఈ పూజాదికాల తరువాత మల్లికార్జునస్వామివారికి సహస్రఘటాభిషేకం ప్రారంభించబడింది. ఈ ఘటాభిషేకం పూర్తయ్యేంతవరకు నిరంతరంగా అర్చకస్వాములు రుద్రమంత్రాలను పఠించడం జరుగుతుంది. ఈ ఘటాభిషేకం పూర్తయిన తరువాత మహానివేదన, నీరాజన, మంత్రపుష్ప కార్యక్రమాలు జరిపించబడుతాయి. కాగా ఈ ఘటాభిషేకం సందర్భంగా స్వామివారి గర్భాలయానికి అడ్డంగా మూడు అడుగుల మేర తాత్కాలికంగా గోడ కట్టడం జరిగింది. దాంతో ఈ రోజంతా కూడా స్వామివారు ఘటాభిషేకజలంలోనే ఉంటారు. ఈ కార్యక్రమములో దేవదాయశాఖ అదనపు కమిషనరు శ్రీఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి. రమణ, శ్రీమతి బి. రవణమ్మ, శ్రీ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, శ్రీమతి జి. లక్ష్మేశ్వరి, శ్రీ దేవికి వెంకటేశ్వర్లు, శ్రీ మేడా మురళీధర్, శ్రీమతి యు. సుబ్బలక్ష్మి, శ్రీమతి జిల్లెల శ్రీదేవి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కారుపర్తి నాగమల్లేశ్వరరావు, శ్రీ ఆకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

**రేపటి కార్యక్రమాలు** (11.08.2026) ఉదయం గం. 9.15లకు పూర్ణాహుతి, కలశోద్వాసన, మహదాశీర్వచనంతో ఈ వరుణ యాగ సహితసహస్ర ఘటాభిషేక విశేష పూజలు ముగుస్తాయి.



## డీఎస్సీ అక్రమాలపై నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**పోలీసుల నోటీసుపై రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆగ్రహం**



**ఖాజీపేట నంది పత్రిక ప్రతినిధి ఆగస్టు 10** మైదుకూరులో సోమవారం నిర్వహించనున్న డీఎస్సీ–2025 అక్రమాలు, అవకతవకలపై నిరసన ర్యాలీకి వెళ్లొద్దంటూ ఖాజీపేట పోలీసులు ఆదివారం రాత్రి 9.11 గంటలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డికి నోటీసు అందజేశారు. ఖాజీపేట మండలం దుంపలగట్టులోని ఆయన స్వగృహంలో ఈ నోటీసును పోలీసులు అందించారు. డీఎస్సీ–2025లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై తక్షణం సీబీఐ విచారణ చేపట్టాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.నిరసన ర్యాలీని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించడం సరికాదని ఆయన విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అక్రమాలు, అన్యాయాలపై ఉద్యమించడం, నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడి హక్కు అని రెడ్యం పేర్కొన్నారు. ప్రజల హక్కులను అడ్డుకునే అధికారం ప్రభుత్వానికి, పోలీసులకు లేదని అన్నారు.

## ఖరీఫ్ పంటల బీమాకు గడువు పొడిగింపు

**ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలి: వ్యవసాయ సహాయకుడు వెంకట్**

**తెలుగు కలం కడప ఆగస్టు 10** ఖరీఫ్2026 సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు పంటల బీమా ప్రీమియం చెల్లించే గడువును ఆగస్టు 15, 2026 వరకు పొడిగించినట్లు పత్తూరు గ్రామ వ్యవసాయ సహాయకుడు వెంకట్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలని ఆయన సూచించారు.

ఒక ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు ఇలా ఉన్నాయి: వరి రూ.85 । కందులు రూ.36 । జొన్న రూ.38 । మినుములు రూ.38 । ఉల్లిపాయలు రూ.91 । పసుపు రూ.182 రైతులు తమ భూమి పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తీసుకుని సమీపంలోని మీసేవ లేదా సీఎస్‌సీ కేంద్రంలో పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలని వెంకట్ తెలిపారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే ప్రీమియం చెల్లించి పంటలకు బీమా రక్షణ పొందాలని ఆయన కోరారు.

## పెన్నా నదిపై లింగంపల్లి వద్ద చెక్‌డ్యామ్ నిర్మించాలి.


**కడప నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ డిమాండ్.**

**బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్.**



**కడప, ఆగస్టు 10:** కడప నగర ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెన్నా నదిపై లింగంపల్లి వద్ద తక్షణమే చెక్‌డ్యామ్ నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి జకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కడప కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ హాల్‌లో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శ్రీ శివరామిరెడ్డిని కలిసి బండి జకరయ్య వినతిపత్రం సమర్పించారు. లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో పెన్నా నదిలో నీటి ప్రవాహం తగ్గిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల బావులు ఎండిపోతున్నాయని ఆయన తెలిపారు. పెన్నా నదిపై లింగంపల్లి వద్ద చెక్‌డ్యామ్ నిర్మించడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా కడప నగర ప్రజలకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కడప నగర భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రతిపాదనను ప్రభుత్వం, జిల్లా అధికారులు సానుకూలంగా పరిశీలించి, చెక్‌డ్యామ్ నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని బండి జకరయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ సి సి కోఆర్డినేటర్ అబ్దుల్ సత్తార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాజీ కాంగ్రెస్ నగర మైనార్టీ అధ్యక్షులు ఆసిఫ్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో స్వర్ణరథారూఢులైన స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు



**శ్రీశైలం ఆగస్టు 10(నంది పత్రిక)** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వర్ణరథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.. అదేవిధంగా ఆ రోజు వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్లకు వైదికపరమైన విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథంపై కొలువై ఉన్న శ్రీస్వామిఅమ్మవార్లకు పూజాదికాలు జరిపించబడుతాయి. ఈ పూజాదికాలకు ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్నికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కాగా సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండి రాష్ట్రం సశ్యశ్యామలంగా ఉండాలనే సంకల్పంతో దేవస్థానం ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకం విశేషపూజలను నిర్వహిస్తున్నందున ఈ స్వర్ణరథోత్సవ ఊరేగింపు నిలుపుదల చేయడం జరిగింది. ఈ పూజలలో దేవదాయశాఖ అదనపు కమిషనరు శ్రీఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి. రమణ, శ్రీమతి బి. రవణమ్మ, శ్రీ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, శ్రీమతి జి. లక్ష్మేశ్వరి, శ్రీ దేవికి వెంకటేశ్వర్లు, శ్రీ మేడా మురళీధర్, శ్రీమతి యు. సుబ్బలక్ష్మి, శ్రీమతి జిల్లెల శ్రీదేవి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కారుపర్తి నాగమల్లేశ్వరరావు, శ్రీ ఆకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## ఇసుకపల్లి మహిళల ఆషాఢ శోభ: జగజ్జననికి అమ్మవారికి సారే సమర్పణ



**సిరివెళ్ల(నంది పత్రిక) :** సిరివెళ్ల మండల పరిధిలోని ఇసుకపల్లి గ్రామానికి చెందిన మహిళలు ఆషాఢ మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో నంద్యాలలో కొలువైన శ్రీ జగజ్జనని అమ్మవారికి పుట్టింటి పట్టుచీరను సమర్పించారు. సాంప్రదాయబద్ధంగా, మేళతాళాలతో కూడిన అంగరంగ వైభవంగా ఈ పుట్టింటి పట్టుచీర ఊరేగింపు జరిగింది.ఆషాఢ మాసం హిందూ సంప్రదాయంలో విశిష్టమైనది. ఈ మాసంలో అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు వంటి మంగళద్రవ్యాలను సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. దీనిలో భాగంగానే ఇసుకపల్లి గ్రామానికి చెందిన భక్తురాల్ల బృందం, గ్రామం నుండి ప్రత్యేకంగా పుట్టింటి సారెను, పట్టుచీరను జగజ్జనని అమ్మవారికి సమర్పించడానికి నంద్యాలకు చేరుకున్నారు. ఈ ఊరేగింపులో పాల్గొన్న మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో, భజనలు చేసుకుంటూ ముందుకు సాగారు. మేళతాళాల ధ్వనులు, భక్తుల జైజై ధ్వానాలతో నంద్యాల వీధులు మారుమోగాయి. ఈ దృశ్యం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయానికి చేరుకున్న అనంతరం, పట్టుచీరను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు మహిళలు తెలిపారు.

# వైసీపీ రౌడీ మూకల దారుణం

**పక్కా ప్లాన్ ప్రకారమే టీడీపీ నేత ఇంతియాజ్ హత్య**
**హంద్రీ నది అక్రమాలను ప్రశ్నించినందుకే కక్షగట్టి ప్రాణాలు తీశారు**
**కర్నూలులో వరుస హత్యలపై విరుచుకుపడిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్**
**రౌడీ మూకలను తుడిచిపెడతాం..**
**త్వరలోనే సీఎం చంద్రబాబు దృష్టికి కర్నూలు పరిస్థితులు**

**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** అధికార దాహంతో వైసీపీ రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడుతూ కర్నూలులో అరాచకాలు సృష్టిస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టీడీపీ తీవ్రంగా శ్రమించి పనిచేస్తున్న కార్యకర్త ఇంతియాజ్ బాషాను ఒక పక్కా పథకం ప్రకారమే దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

**అక్రమాలను ప్రశ్నించడమే నేరమా?** గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన ఇంతియాజ్‌ను నామినేషన్ ఉపసంహరించుకోవాలని వైసీపీ వర్గీయులు బెదిరించడమే కాకుండా ఆయన ఇంటిపైకి వెళ్లి గొడవ చేశారని మంత్రి గుర్తుచేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన ఇంతియాజ్, హంద్రీ నది తీరంలో వైసీపీ నేతలు సాగిస్తున్న కబ్జాలు, అక్రమాలను ధైర్యంగా బయటపెట్టారని... ఆ కక్షతోనే ఆయనను పొట్టనబెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇంటెలిజెన్స్ వైఫల్యంపై అసహనం:** గత రెండేళ్లలో కర్నూలులో జరిగిన మూడు హత్యల్లోనూ వైసీపీ ప్రమేయం స్పష్టంగా ఉందన్నారు. "ఇంతియాజ్‌ను చంపుతామని వారం రోజుల ముందే సోషల్ మీడియాలో పరోక్ష పోస్టులు వచ్చినా ఇంటెలిజెన్స్ వర్గాలు ఎందుకు కనిపెట్టలేకపోయాయి? ఇప్పటికైనా పోలీసులు ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలి" అని స్పష్టం చేశారు. గతంలో తన కార్యాలయం ముందు ఉద్దేశపూర్వకంగానే వైసీపీ నేతలు రెచ్చగొట్టేలా ర్యాలీలు చేశారని, అధికారులకు మొరపెట్టుకున్నా వారి తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఫ్యాక్షనిజం తరహాలోనే రౌడీయిజానికి చరమగీతం:** కర్నూలులో నెలకొన్న ప్రస్తుత అరాచక పరిస్థితులను త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. 1994-2004 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం ఫ్యాక్షనిజం నడుము విరిచినట్లే, ఇప్పుడు కర్నూలులోని రౌడీ మూకలను కూడా తుడిచిపెట్టేలా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.




## రాకపోకలకు అడ్డంగా పాతిన విద్యుత్ స్తంభాలు.

### ప్రశ్నార్థకంగా మారిన పంటల సాగు.



**శిరివెళ్ల (నంది పత్రిక ) :** ఆరుగాలం శ్రమించి ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసే అన్నదాతకు విద్యుత్ శాఖ అధికారుల స్వార్థం అవకాశవాదం నిర్లక్ష్యం అన్నదాతకు శాపం అయింది. పొలాల్లోకి ట్రాక్టర్ గాని పంట కోత మిషన్లు గానీ వెళ్లకుండా రాకపోకలు కొనసాగించే తెలుగు గంగ నది కట్టపై విద్యుత్ స్తంభాలను యదేచ్ఛగా పాతి పెట్టిన సంఘటన శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. పక్కనున్న రైతులు ఏమైపోతే నాకేంటి నా పొలం పండితే చాలు నా పొలానికి విద్యుత్ సరఫరా ఉంటే చాలు విద్యుత్ అధికారుల కొటేషన్ ఉన్నా లేకున్నా విద్యుత్ ప్రమాదంలో రైతులు మృతి చెందితే ఎవరేమీ పీకలేరు అన్న చందంగా తెలుగు గంగ 16వ బ్లాకు కాలువ కట్ట పై విద్యుత్ స్తంభాలను పాతిన సంఘటన సంచలనం రేపుతున్నది. సుమారు 25 ఎకరాలకు పైగా పంటల సాగు ప్రశ్నార్థకంగా మారనున్నదని కనీసం ఎద్దుల బండ్లు సైతం పోలేని విధంగా విద్యుత్ స్తంభాలు పాతి పక్క రైతుల కష్టాలను నష్టాలను ఇబ్బందులను ఆలోచించడం లేదని బాధిత రైతులు పెద్ద సుబ్రమణ్యం,చిన్న సుబ్బయ్య,సుమిత్ర,వెంకట సుబ్బయ్య,గోవర్ధన్ స్వామి,వెంకట స్వామి,లక్ష్మీ దేవి, బాల సుబ్రహ్మణ్యం తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా ఎస్పీ దొరవారు నంద్యాల జిల్లా కలెక్టర్ వారు తెలుగు గంగ అధికారులు నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఏడి గారు వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా స్పందించి పంటల సాగుకు ప్రతిబంధకాలుగా పాతిన విద్యుత్ స్తంభాలను తొలగించి పేద మధ్యతరగతి సామాన్య రైతులు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

# డీఎస్సీ మెరిట్ లిస్ట్ ఎందుకు విడుదల చేయలేదు?



**విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి**
**నంద్యాలలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**
**మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్**

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 10 ( నంది పత్రిక )** ప్రభుత్వ ఉద్యోగ నియామకాలన్నింటిలో మెరిట్ జాబితాను పారదర్శకంగా బయటపెట్టాలని, డీఎస్సీ2025 ఉపాధ్యాయ నియామకాల్లో మెరిట్ లిస్ట్ ఎందుకు ప్రకటించలేదో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు డీఎస్సీ అక్రమాలు, నిరుద్యోగులకు జరిగిన అన్యాయంపై శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాలలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువజన విభాగం నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ ర్యాలీ, శిల్పా రవి రెడ్డి నివాసం నుండి ప్రారంభమై శ్రీనివాస్ సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి ,మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర వైసీపీ జజుజ మెంబర్ మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, రాష్ట్ర వైసీపీ కౌన్సిల్ సభ్యులు రామలింగారెడ్డి, సాయినాథ్ రెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి వైసీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతను, నిరుద్యోగులను దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. డీఎస్సీ నియామకాలను నిజాయితీగా చేపట్టి ఉంటే మెరిట్ లిస్ట్ విడుదల చేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏంటని నిలదీశారు. "మా సవాల్‌ను స్వీకరించి మంత్రి నారా లోకేష్ తక్షణమే మెరిట్ లిస్ట్‌ను బహిర్గతం చేయాలి. స్పోర్ట్స్ కోటాలో ఏ ప్రాతిపదికన, ఏ మెరిట్ ప్రాకారం ఉద్యోగాలు కేటాయించారో స్పష్టం చేయాలి" అని డిమాండ్ చేశారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన ప్రతిభావంతులైన అభ్యర్థులను తాము తప్పుపట్టడం లేదని, వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నామని... కానీ పారదర్శకత లేకపోవడం వల్లే నిజమైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం:** ఒకవైపు నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటూ, మరోవైపు రైతులను కూడా కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని శిల్పా రవి రెడ్డి విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రైతుల అవసరాలకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేవలం 10 శాతం మాత్రమే పూర్తి చేయాలని దానిని అలాగే వదిలేశారని, తక్షణమే పూర్తి చేసి రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలోరాష్ట్ర వైసిపి రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం సెక్రటరీ శశికలా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మా భున్నిసా, రాష్ట్ర ాా సెల్ సెక్రెటరీ శంకర్ నాయక్, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమాన్, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, నంద్యాల జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్ నంద్యాల జిల్లా వైసీపీ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కారు రవికుమార్ జిల్లా వైసీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టివీ రమణ,నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి వైసీపీ నాయకులు ప్రహల్లాద రెడ్డి, జిల్లా వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల మండలం వైసిపి అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, నంద్యాల అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు శ్రీనివాసులు, నంద్యాల అసెంబ్లీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామచంద్రుడు నంద్యాల అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు హుస్సేనమ్మ,, నంద్యాల అసెంబ్లీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ మరియు వైఎస్ఆర్సిపి మాజీ కౌంటర్ సభ్యులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అవయవదానంపై విస్తృత అవగాహన కార్యక్రమం




**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 10 . (నంది పత్రిక ):**ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో జిల్లాలో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలను గౌరవ జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ప్రారంభించారు.కలెక్టరేట్ కార్యాలయంలోని పి జి ఆర్ ఎస్ హాల్ ముందు ఏర్పాటుచేసిన ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్ అనే సెల్ఫీ ఫోటో పాయింట్ లో ఫోటో దిగి ఆర్గాన్ డొనేషన్ ను అంగీకరిస్తూ అప్లికేషన్ ను పూరించి రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల , సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష , జిల్లా అధికారులు రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.తదుపరి పీజిఆర్ఎస్ హాల్ నందు ఆర్గాన్ డొనేషన్ పై రెడ్ క్రాస్ ముద్రించిన అవగాహన పోస్టర్లను విడుదల చేయడంతో పాటుగా అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కర్నూల్ మెడికల్ కళాశాలకు చెందిన లెక్చరర్ బి సురేష్ కుమార్ ఆర్గాన్ డొనేషన్ కు సంబంధించిన అన్ని అంశాలను పిపిటి ద్వారా అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగి పంచాయతీ కార్యదర్శి బొప్పా సుజాత మొట్టమొదట మహిళా అవయవదాత గురించి వివరిస్తూ, చనిపోయిన తర్వాత కూడా ఎనిమిది మందిని మనం బ్రతికించవచ్చని చనిపోయిన తర్వాత ఈ శరీరము మట్టిలో కలిసిపోతుందని ప్రతి ఒక్కరము అవయవదానానికి ముందుకు రావాలని, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో అవయవదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా దాదాపు 200 మందికి పైగా అధికారులు ప్రజలు అవయావధానానికి అంగీకరిస్తూ రిజిస్ట్రేషన్ చేసుకుని ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్ సెల్ఫీ దిగారు.తదుపరి రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవయవ దానం పై పై అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, కర్నూల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బి సురేష్ కుమార్, రెడ్ క్రాస్ ఉమెన్స్ వింగ్ వసుంధర దేవి , ప్రభుత్వ కళాశాల రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ సంజయ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయానంద్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


## పంట నమోదును పరిశీలించిన వ్యవసాయాధికారి



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 10** :బండి ఆత్మకూరు మండల పరిధిలోని పెద్దదేవలాపురం రైతు సేవ కేంద్రం నందు పంట నమోదును మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... రైతులు సాగు చేసిన పంటలను స్వీయంగా రైతులే ఏపీఎస్ యాప్ ద్వారా పంట నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన రైతులు స్వీయంగా పంట నమోదు చేసుకోవచ్చని, స్వీయ నమోదు అనంతరం పంట వివరాలు రైతు సేవా కేంద్ర సిబ్బంది ధ్రువకరిస్తారని వారు తెలిపారు. ఖరీఫ్ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆగస్టు 15 వరకు గడవు ఉన్నదని రైతులు త్వరగా పంట బీమా చేసుకోవాలని పేర్కొన్నారు. సాగుచేసిన ప్రతి పంట ప్రతి ల్యాండ్ పర్సల్ ఈ పంట నందు నమోదు కొరకు సెప్టెంబర్ 20న ఆఖరి తేదీ కనుక త్వరగా పంట నమోదు పూర్తిచేయాలని రైతు సేవ కేంద్ర సిబ్బందిని ఏఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్ఫత్ పాల్గొన్నారు.

# సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి..!





**జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా**

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 10 నంది పత్రిక:** వికసిత భారత్, స్వర్ణాంధ్ర -2029 లక్ష్యాలను అధిగమిస్తూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల స్ఫూర్తితో.. కడపను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జేసీ డా. నిధి మీనా.. డిఆర్వో మల్లికార్జునుడు తోకలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో జేసీ డా. నిధీమీనా మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. వికసిత భారత్ లక్ష్యాలను అధిగమిస్తూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల స్ఫూర్తితో.. వైఎస్ఆర్ కడప జిల్లాను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. పీజీఆర్ఎస్ పై ప్రజల అభిప్రాయాలను తప్పక స్వీకరించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ.. సమస్యలకు తావులేని స్వేచ్ఛాయుత జీవనాన్ని జిల్లా ప్రజలకు అందించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు.

వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా 2029 రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు, ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జిల్లా ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలని జేసీ అధికారులకు సూచించారు.

ఇందుకోసం నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, ఎస్డీసీ వెంకటపతి, డిప్యూటీ కలెక్టర్లు శివ రామిరెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు..

## విద్యార్థినిలు విద్యను ఆయుధంగా చేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 10 ( నంది పత్రిక )** సమాజంలో ప్రతి విద్యార్థిని విద్యను ఆయుధంగా చేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలనీ రోటరీ ఇన్నర్ వీల్ పాస్ట్ ప్రెసిడెంట్ రెడ్ క్రాస్ సొసైటీ యాక్టివ్ మహిళ చెన్నమరాజు వసుంధర దేవి పేర్కొన్నారు.నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికల అవగాహన కార్యక్రమం నిర్వహించడమైనది.ఈ కార్యక్రమంలో జనూ డిస్టిక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజా హుస్సేన్ మాట్లాడుతూ బాలికలకు ప్రభుత్వం చాలా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అందులో ఒకటి.బెట్టి బచావో భేటీ పడవో కార్యక్రమాలతో ప్రతి ఆడపిల్లకు మంచి భవిష్యత్తుని ఇవ్వడం జరుగుతుందని అన్నారు.రోటరీ ఇన్నర్ వీల్ పాస్ట్ ప్రెసిడెంట్ రెడ్ క్రాస్ సొసైటీ యాక్టీవ్ మహిళ చెన్నమరాజ వసుంధర దేవి మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. నేటి బాలికలే రేపటి భారతదేశ నిర్మాణ శిల్పులు. ప్రతి బాలిక విద్యను ఆయుధంగా చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. బాల్య వివాహాలు, సోషల్ మీడియా మోసాలు మరియు నిరాశ వంటి వాటికి దూరంగా ఉండి తమ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సమాజం కలిసి బాలికలకు సురక్షితమైన, ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించినప్పుడే వారి ప్రతిభ వెలుగులోకి వస్తుంది. విద్యతో పాటు మంచి విలువలు, ఆత్మగౌరవం మరియు సేవాభావాన్ని పెంపొందించుకుంటూ ప్రతి బాలిక ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను.ఈ కార్యక్రమంలో జనూ సిబ్బంది మరియు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ , విద్యార్థులు పాల్గొనటం జరిగింది.

## ఉద్యోగుల డేటా లీక్ ఆరోపణలు.. స్పందించిన టీసీఎస్

భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తమ సిస్టమ్స్‌లో డేటా ఉల్లంఘన జరిగినట్లు వస్తున్న ఆరోపణలను తోసిపుచ్చింది. తమ వ్యవస్థల్లో గానీ, కస్టమర్ల సమాచారానికి సంబంధించి గానీ ఎటువంటి చొరబాటు జరిగినట్లు విశ్వసనీయ ఆధారాలు లేవని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు అధికారిక సమాచారం అందించింది. కొంతమంది ఉద్యోగుల సమాచారం ఆన్‌లైన్‌లో బహిర్గతమైందన్న వార్తలపై దర్యాప్తు చేపట్టినట్లు టీసీఎస్ తెలిపింది. సదరు డేటా నాలుగేళ్ల క్రితం నాటిదని, అందులో కేవలం ప్రాథమిక ఉద్యోగ వివరాలు మాత్రమే ఉన్నాయని పేర్కొంది. ఈ ఘటన కారణంగా కస్టమర్ల డేటాకు గానీ, కంపెనీ నిర్వహణ వ్యవస్థలకు గానీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని స్పష్టం చేసింది. పాస్‌వర్డ్ స్ప్రేయింగ్, మల్టీ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఫెటీగ్ వంటి పద్ధతుల్లో తాము దాడి చేసినట్లు హ్యాకర్లు పేర్కొన్నారని, అయితే ఇటువంటి సైబర్ దాడులను తిప్పికొట్టేందుకు గత రెండేళ్లుగా తమ వద్ద అత్యంత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థలు ఉన్నాయని టీసీఎస్ వివరించింది. తమ భద్రతా వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అంతర్గత సమీక్షలో తేలిందని కంపెనీ వెల్లడించింది.

# డి కె టి భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

### సర్వే నంబర్ 1306/2లో 4.96 ఎకరాల భూమి తమదేనంటున్న ఎస్సీ కుటుంబం.. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణ



**పోరుమామిళ్ల, ఆగస్టు 10: (నంది పత్రిక):** తమకు ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటి భూమిని నకిలీ పత్రాల ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపిస్తూ పోరుమామిళ్ల మండలం గిరినగర్ ప్రాంతానికి చెందిన చాటకొండు గురయ్య సోమవారం పోరుమామిళ్ల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గురయ్య సమర్పించిన అర్జీ ప్రకారం.. రంగసముద్రం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1306/2లో 4.96 ఎకరాల భూమిని 1989లో డి కె టి పట్టా నంబర్ 42/1399ఖీ ద్వారా తనకు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అనంతరం 2009లో పోరుమామిళ్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి తనకు పొసెషన్ సర్టిఫికెట్ కూడా జారీ అయిందని పేర్కొన్నారు.అయితే కలసపాడు మండలం ముసలిరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన కల్లూరి రామకృష్ణ రెడ్డి అనే వ్యక్తి, సదరు భూమిని బ్యాంకు వేలంలో కొనుగోలు చేసినట్లు ఒక పత్రం సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గురయ్య ఆరోపించారు. 25-06-2011న డాక్యుమెంట్ నంబర్ 197/2011 ద్వారా కల్లూరి రామిరెడ్డి పేరుతో, అనంతరం 22-07-2011న డాక్యుమెంట్ నంబర్ 2567/2011 ద్వారా తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తదుపరి భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించారని, ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉందని గురయ్య ఆరోపించారు. తనకు చెందిన భూమిపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతూ, తమను మరియు కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ భూమికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో (డబ్ల్యూ. పి) నం. .5156/2024 కేసు నడుస్తోందని, అలాగే బద్వేల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓ ఎస్.నం .139/2022, ఐ ఏ .నం .460/2022 కేసుల్లో తమకు ఇంజక్షన్ ఆర్డర్ మంజూరైందని గురయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రస్తుతం ఆ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.సర్వే నంబర్ 1306/2పై కోర్టు తుది నిర్ణయం వెలువడే వరకు ఎలాంటి ఆన్‌లైన్ మార్పులు, పొసెషన్ సర్టిఫికెట్లు లేదా ఇతర రెవెన్యూ చర్యలు చేపట్టవద్దని తహసీల్దార్‌ను కోరారు. వివాదాస్పద రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తన అర్జీకి డి కె టి పట్టా, పట్టాదారు పాస్‌బుక్, పొసెషన్ సర్టిఫికెట్, కోర్టు ఉత్తర్వుల ప్రతులు, ఆన్‌లైన్ ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌లను జత చేసినట్లు గురయ్య తెలిపారు. ఈ ఫిర్యాదు ప్రతులను జిల్లా కలెక్టర్, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ తదితర అధికారులకు కూడా పంపినట్లు పేర్కొన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బాధితుడు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

### కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

### ‘ప్రజా ఫిర్యాదుల’ స్వీకరణకు 21 అర్జీలు



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగర ప్రజల నుంచి వివిధ రూపాల్లో అందుతున్న అర్జీల పరిష్కారంలో జాప్యం తగదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులకు సూచించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య ప్రాంతాన్ని సందర్శించినప్పుడు సమస్యను పూర్తిగా గ్రహించి, పరిష్కారం కనుగొనడం సులభమవుతుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు శాశ్వతంగా పరిష్కరించి, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచుదామని కమిషనర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ జునైద్, ఎస్‌ఈ రమణమూర్తి, కార్యదర్శి నాగరాజు, ఏసిపిలు శబ్బం శాస్త్రీ, నాగరాజు, ఆర్వోలు వాజిద్, క్రిస్టోఫర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య నగరానికి క్రిమిసంహారక కవచం

### ప్రతిరోజు 4 వేల లీటర్ల సోడియం హైపోక్లోరైట్ పిచికారీ

### కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగరంలో ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలను మరింత ముమ్మరం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు క్రిమిసంహారక ద్రావణం పిచికారీని విస్తృతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం పాతబస్తీలోని పెద్ద మార్కెట్ వద్ద సోడియం హైపోక్లోరైట్ పిచికారీ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ ఉచితంగా అందిస్తున్న సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని నగరంలోని వివిధ ప్రాంతాల్లో పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సుమారు 4 వేల లీటర్ల హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేసేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.ముఖ్యంగా మార్కెట్లు, రద్దీ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, కాలనీలు, డ్రైనేజీ పరిసరాలు, చెత్త నిల్వ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కమిషనర్ వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నగరపాలక సంస్థతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, సానిటరీ ఇంస్పెక్టర్‌లు లోకేష్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తితో.. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా “అనే నేను” కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపు



**కడప బ్యూరో చీఫ్, ఆగస్టు 10: నంది పత్రిక** దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా చాటుతూ, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించేలా “దేశ నిర్మాణంలో భాగస్వాములు” (ఖుతీఅవతీం అఅ చీఫ్‌అశీఅ దీబఅశ్రీ,ఎఅఅస్త్ర), మరియు “అనే నేను” (చూాఅవచీవఅబ) అనే కార్యక్రమాలను జిల్లాలో ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా.. దేశం పట్ల బాధ్యత, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అనే సంకల్పంతో జరుపుకోవాలన్నారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో కలిసి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు.ఆగస్టు 14న అటవీ, ఉద్యానవన శాఖల సహకారంతో జిల్లావ్యాప్తంగా భారీ మొక్కల పెంపకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రముఖ ప్రదేశాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండాను చేతబూని దేశ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడం ద్వారా స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని కోరారు. ఆగస్టు 14, 15 తేదీల్లో ప్రభుత్వ భవనాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన కూడళ్లను జాతీయ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి స్వాతంత్ర్య వేడుకల వాతావరణాన్ని మరింత శోభాయమానం చేయాలని సూచించారు.

**విద్యార్థుల్లో దేశభక్తి, బాధ్యతా భావం పెంపొందించాలి**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో “అనే నేను” కార్యక్రమాన్ని నిర్వహించి.. విద్యార్థులు దేశ భవిష్యత్తు కోసం తాము చేయగలిగే మంచి పనులను స్వయంగా ప్రతిజ్ఞ రూపంలో తెలియజేసేలా ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. చిన్న వయసు నుంచే దేశం పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవా భావం, పర్యావరణ పరిరక్షణ వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా దేశ నిర్మాణ సందేశంలి

యువత, విద్యార్థులు, ప్రముఖులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో “అనే నేను” సామాజిక మాధ్యమ ప్రచారంలో పాల్గొనాలని డా. నిధీ మీనా కోరారు. జాతీయ జెండాను చేతిలో పట్టుకుని “అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా...” అంటూ 30 నుంచి 60 సెకన్ల స్వీయ వీడియోలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలని సూచించారు. 2026 వంటి గుర్తింపు పదాలతో ప్రచారం చేసి, అధికారిక ప్రభుత్వ సామాజిక మాధ్యమ ఖాతాలను గుర్తించాలని కోరారు. హ్యాష్‌టాగ్‌లతో, జాతీయ జెండాను చేతిలో పట్టుకుని... “అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా...“ అంటూ 30 నుండి 60 సెకన్ల సెల్ఫీ వీడియోను రూపొందించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేసి హెూాటటఅఎఖుశ్రీచీవషం పేజీని ట్యాగ్ చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వికసిత్ భారత్2047, స్వర్ణాంధ్ర2047 లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. “ఆలోచిద్దాం.. ఆచరిద్దాం.. వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం” అనే స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, దేశ నిర్మాణంలో మన వంతు బాధ్యతను నిర్వర్తిద్దామని జిల్లా ప్రజలకు డా. నిధీ మీనా పిలుపునిచ్చారు.

# ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం పెంపు

### రూ. 50,000 నుంచి రూ. 75,000 కు పెంచిన ప్రభుత్వం

### న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్




**అమరావతి, ఆగస్టు10. నంది పత్రిక:** రాష్ట్రం లోని ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం ను రూ.50,000 నుంచి రూ.75,000 కు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.రాష్ట్ర వ్యాప్తంగా 34 ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల కోర్టులు పని చేస్తున్నాయని తెలిపారు.2017 సంవత్సరం తర్వాత ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం పెంచలేదన్నారు. ఈ నేపథ్యంలో వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్లు చేసిన విన్నపాన్ని హైకోర్ట్ పరిశీలించి 34 కోర్టుల్లో పనిచేస్తున్న మేజిస్ట్రేట్ ల నెలసరి గౌరవ వేతనాన్ని పెంచేందుకు సిఫార్సు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన సియం చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ల నెలసరి గౌరవ వేతనాన్ని రూ. 50,000 ల నుండి 75,000 లకు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న రవాణా భత్యం (కన్వేయన్స్ అలవెన్సు) రూ. 10,000ను కొనసాగించుటకు కూడా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ మేరకు గౌరవ వేతనం పెంపు, రవాణా భత్యం తో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా ఇటీవల సెకండ్ క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం నెలకు రూ.30,000 నుండి రూ.45,000 కు పెంచిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. గౌరవ వేతనం పెంపు పట్ల ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్లు హర్షం వ్యక్తం చేశారు.

# ఎయిడ్స్‌పై అవగాహనతోనే నియంత్రణ సాధ్యం..!




### జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు జిల్లావ్యాప్తంగా విస్తృత చైతన్య కార్యక్రమాలు

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 10 నంది పత్రిక:** అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 12 నుంచి అక్టోబరు 12 వరకు రెండు నెలల పాటు జిల్లావ్యాప్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగిక వ్యాధులు, మాదకద్రవ్యాల వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో లోని సభా భవన్ లో “మోబిలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష” (ఎంఏఎస్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న రెండు నెలల అవగాహన కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను జిల్లాలో ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఎన్జీవోలు, ఐసీటీసీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, రెడ్ రిబ్బన్ కళాశాలలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలోని అధిక ప్రమాద గ్రామాలు, కళాశాలలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ప్రజలు, యువత, విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు హెచ్ఐవీ పరీక్షలు, చికిత్సపై చైతన్యం తీసుకురావాలని సూచించారు.

**95.95.99 లక్ష్యాల సాధనపై దృష్టి..** హెచ్ఐవీ పరీక్షల లక్ష్యాన్ని కనీసం 95 శాతానికి చేర్చాలని, హెచ్ఐవీ ఉన్న వారిలో 95 శాతం మందికి చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో వైరల్ లోడ్ నియంత్రణకు సంబంధించి 99 శాతం లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. హెచ్ఐవీపై అపోహలను తొలగించి, వ్యాధి నిర్ధారణ, చికిత్స అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

**ప్రతి గ్రామానికి అవగాహన కార్యక్రమాలు** జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, లింక్ వర్కర్ పథకం సిబ్బంది సహకారంతో జిల్లాలోని ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కళాశాలల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో, పాఠశాలలు, వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.హెచ్ఐవీ పరీక్షలు, లైంగిక వ్యాధులు, సురక్షిత పద్ధతులు, కండోమ్ వినియోగం, టోల్‌ఫ్రీ నంబర్ 1097, హెచ్ఐవీ చట్టం2017, హెచ్ఐవీపై ఉన్న అపోహలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ, లైంగిక వ్యాధులపై ప్రజల్లో పరిజ్ఞానం పెంపొందించడం, సురక్షిత పద్ధతులపై అవగాహన కల్పించడం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల వివక్షను తగ్గించడం, ఎక్కువ మంది హెచ్ఐవీ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, ఇన్‌చార్జి జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఎస్. ప్రవీణ్, డీపీఎంఓ డాక్టర్ తాహర్, మెడికల్ ఆఫీసర్

డాక్టర్ హీరందీర్, జిల్లా పరిషత్ సీఈఓ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిపాలనాధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వేమపల్లె భాస్కర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ అంజినేయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, టీఐఎన్‌జీఓ, దిశ సిబ్బంది, జిల్లా సహయోగి (న్యాకో) వి. విజయ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# అనాధ పిల్లల సంక్షేమం కోసం మిషన్ వాత్సల్య..



**చాగలమర్రి ఆగస్టు 10 నంది పత్రిక** తల్లిదండ్రులు చనిపోయిన, తండ్రి చనిపోయిన అనాధ పిల్లల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రారంభించడం జరిగిందని ఐసిడిఎస్ చాగలమర్రి మండల సూపర్వైజర్ సుశీల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అనాధ పిల్లలకు నెలకు 4 వేలు చొప్పున నెల నెలకు పిల్లల తల్లి ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాల వయసు వరకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ పథకం తల్లి తండ్రి లేని పిల్లలకు, కుటుంబంలో ఎవరో ఒకరు లేని పిల్లలకు, విడాకులు తీసుకున్న వారి పిల్లలకు, యాసిడ్ బాధిత పిల్లలకు, ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల పిల్లలకు వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకానికి పిల్లల వయసు 2026 మార్చి 31 నాటికి 18 ఏళ్ల లోపు ఉండాలన్నారు. 18 సంవత్సరాల వరకు ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. దరఖాస్తులను అందజేసేందుకు స్థానిక అంగన్వాడీ కేంద్రంలోని అంగన్వాడీ టీచర్ ను సంప్రదించాలని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ ను సంప్రదించాలని, మండల పరిధిలో సూపర్వైజర్ ను అడిగి తెలుసుకుని దరఖాస్తు చేయాలన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 10 . (నంది పత్రిక ):** బ్రిటీష్ పాలకులను భారతదేశాన్ని వదిలి పొమ్మని కోరిన రోజు ఆగస్టు 9. నేడు దేశంలో కార్మికులు, రైతాంగం, సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై సీఐటీయూ, రైతు సంఘం, వ్య.కా.సం ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం నుండి సంజీవ్ నగర్ గేట్ వరకు భారీగా ప్రదర్శన చేపట్టిన అనంతరం రాస్తారోకో చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమం నకు సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి. వెంకటలింగం, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ధనుంజయుడు అధ్యక్షత వహించగాముఖ్య అతిధి గా హాజరైన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అందని ద్రాక్షలా మారింది. తాము సృష్టిస్తున్న సంపదలో కార్మికులకు తగిన వాటా దక్కాలి. భార్యా, భర్త, ఇద్దరు పిల్లలు కలిగిన కార్మిక కుటుంబానికి నెలకు కనీసం రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలి. కార్మిక హక్కులను హరించివేస్తున్న లేబర్కోడ్లను రద్దు చేయాలి. పర్మినెంట్ పనుల్లో ఉన్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలి.శ్రామికులందరి జీవనాలపై ప్రతికూల విధానాలపై ఐక్యంగా మనం గళమెత్తాలి. బీజేపీ మోడీ పాలనలో నిరుద్యోగం, మునుపెన్నడు లేనంతగా నిత్యావసర సరుకుల ధరల పెంపు, గ్యాస్ ధరల పెంపు, పెట్రోలు, డీజిల్ ధరల పెంపు, ట్రేడ్ యూనియన్ హక్కులపై దాడి, విద్యుత్తో సహా ఆర్టీసీ, మున్సిపల్ సేవలు ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడం, ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరుగుతున్నది. వీటికి తోడు ప్రజలను కులాలు, మతాలు వారీగా విడగొడుతున్నారు. వీటన్నింటినీ మనం ఎదురించి నిలబడాలి. ప్రజలను ఐక్యంగా నిలబెట్టాలని,కార్మికులు, రైతులు, ప్రజాస్వామ్య శక్తులు రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. జీవనోపాధులను, లౌకికతత్వాన్ని రక్షించుకోవాలి. అందరం ఐక్యమవుదామని పిలుపు నీచ్చారు.అదేవిధంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్,కార్యదర్శులు రామచంద్రుడు,సోమన్న,వ్య.కా.సం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్ లు మాట్లాడుతూ గత 12 సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం కార్మికులను నయా బానిసలుగా చేస్తుందని, వెంటనే నాలుగు లేబర్ కోడలను రద్దు చేయాలని ,రైతుల భూములను



పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పి రైతులను దివాలా తీసే విధానాలను అవలంబిస్తుందని, రైతులు పండించిన పంటలు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందని దేశవ్యాప్తంగా కార్మిక కర్షక ఐక్యతను మరింతగా పెంచేందుకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ రోజున దేశవ్యాప్తంగా జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రాబోయే కాలంలో మోడీ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా ఏకం కావాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే మహమ్మద్ గౌస్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ జిల్లా నాయకులు రత్నమయ్య, నరసింహ, ఏ ఐ టి యు సి నాయకులు శ్రీనివాసులు, నాగరాముడు,లక్ష్మీదేవి, వీరితో పాటు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాల్సిందే





## అనంతపురంలో వెటరన్ జర్నలిస్టుల ధర్నా

**అనంతపురం బ్యూరో చీఫ్ , ఆగస్టు 10 నంది పత్రిక:** దేశంలోని 19 రాష్ట్రాల్లో అమలవుతున్న తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ సీనియర్ జర్నలిస్టులకు తక్షణమే గౌరవప్రదమైన పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వెటరన్ జర్నలిస్టులు ఆందోళన బాట పట్టారు. జిల్లా వెటరన్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం నగరంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో జీవితాలను అంకితం చేసి, ప్రజలకు నిరంతరం సమాచారాన్ని అందించిన సీనియర్ పాత్రికేయుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. వయసు మీద పడిన జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**19 రాష్ట్రాల్లో అమలు.. ఏపీలో ఎందుకు ఆలస్యం?** దేశంలోని 19 రాష్ట్రాల్లో ఇప్పటికే సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాలు అమలవుతున్నాయని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ వెంటనే పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి, వృద్ధాప్యంలో వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

**వినతులు ఇచ్చినా స్పందన కరువు** సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సమాచార శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని నాయకులు తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందన్నారు.

**డిమాండ్‌పై సానుకూల నిర్ణయం తీసుకోవాలి**

వృద్ధాప్యంలో ఉన్న పాత్రికేయులకు పెన్షన్ పథకం ఎంతో అవసరమని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్‌ను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వెటరన్ జర్నలిస్టులు, సీనియర్ పాత్రికేయులు, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## తోట వారి వీధిలో సి. సి.రోడ్లు వేసారు, కాల్వలు మరిచారు.

### రోడ్లపై పడుతున్నా మురుగునీరు.

### కాల్వలు ఏర్పాటుచేయాలని ప్రజలు విగ్నేప్తి.





**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 10 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం లలితానగర్ సమీపంలోని తోట వారి వీధిలో సి.సి.రోడ్డు వేసారు కానీ కాల్వలు మరచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.వార్డుల్లో రోడ్లు లేక కొందరు ఇబ్బందులు పడుతుంటే అన్ని ఉండి అల్లుడు నోట్లో శని అన్న చందంగా సి.సి.రోడ్లు వేసారు కానీ కాల్వలు లేకపోవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.వివరాల్లోకి వెళితే పట్టణంలో భూముల ధరలు అధికంగా ఉండడంతో అప్పట్లో కొందరు లలితా నగర్ సమీపంలోని తోట వారి వీధిలో స్థలాలు కొనుగోలు చేశారు.ధరలు తక్కువగా ఉండడంతో కొందరు అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.ప్రభుత్వం అప్పట్లో ఆ ప్రాంతంలో సి.సి.రోడ్లు వేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.దాదాపు 8 ఏళ్ల క్రితం రోడ్లు వేసారు కానీ సి.సి.రోడ్లకు నిధులు మంజూరైన నేటివరకు కాల్వలు వేయడం మరచిపోయారు. నాటి నుంచి నేటి వరకు కాల్వలు వేయాలని మున్సిపల్ అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కనీసం ఆ ప్రాంతంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా,కాల్వలు వెంటనే ఏర్పాటుచేయాలని విగ్నేప్తి చేస్తున్నారు.మున్సిపల్ అధికారులు శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తే ప్రజా సమస్యలతో పాటు ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది.

## హెచ్ఐవీఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కల్పించాలి

### మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో ఆర్‌డీఓ హెచ్. చంద్రమోహన్




**బద్వేల్, ఆగస్టు 10: (నంది పత్రిక)**హెచ్ఐవీఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బద్వేల్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ హెచ్. చంద్రమోహన్ సూచించారు.బద్వేల్ పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఆర్‌డీఓ హెచ్. చంద్రమోహన్ ఆధ్వర్యంలో మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన (ఐఈసీ )ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు వివిధ కమ్యూనిటీ ప్రాంతాలతో పాటు జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో హెచ్ఐవీఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువతకు హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలు, అపోహలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ హెచ్ఐవీఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నివారణకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన పెంచాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు. ప్రజలందరికీ సరైన సమాచారం అందించడం ద్వారా హెచ్ఐవీఎయిడ్స్ లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రీకాంత్, డిప్యూటీ సివిల్ సర్జన్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసులు, జోనల్ సూపర్‌వైజర్ సీఎల్‌డబ్ల్యూ కవిత, వెంకటరమణ, ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ భారతీ లక్ష్మి, ఎన్‌జీవోలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో వైద్యుల సూచనలు

**బద్వేల్, ఆగస్టు 10: (నంది పత్రిక )**బద్వేల్ మండల పరిధిలోని తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, సురక్షిత ప్రసవం, పోషకాహారం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి. రాజేష్ కుమార్, సంజీవిని ప్రైవేట్ ఆసుపత్రి స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ శివలలిత మాట్లాడుతూ ప్రతి గర్భిణీ రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తీసుకోవాలని, గర్భధారణ సమయంలో వైద్యులు, స్త్రీ వ్యాధి నిపుణుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీలకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే ఉచిత వైద్యం, ఉచిత రక్త పరీక్షలతో పాటు అవసరమైన సమయంలో 108 అంబులెన్స్ ద్వారా ఉచిత రవాణా సదుపాయం అందుబాటులో ఉందని వివరించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద అర్హులైన మహిళలకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సుభాన్ ఆధ్వర్యంలో సుమారు 36 మంది గర్భిణీలకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తదితర పరీక్షలతో పాటు బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేశారు. సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల లక్షణాలను గుర్తించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య మాట్లాడుతూ బాలికలకు సరైన వయసులోనే వివాహం జరగాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని, ఆడపిల్లైనా మగపిల్లైనా సమానమేనని గర్భిణీలకు అవగాహన కల్పించారు. బేటీ బచావోబేటీ పడావో కార్యక్రమం ప్రాముఖ్యతను



వివరించారు.ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని తీసుకోవడంతో పాటు ఏఎన్ఎంలు సూచించే ఐరన్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా వినియోగించాలని తెలిపారు. గర్భధారణ సమయంలో రక్తహీనతను నివారించేందుకు వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు.అదేవిధంగా 108, 104, 102 వాహన సేవల గురించి గర్భిణీలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. చంద్రివతి, హెల్త్ సూపర్‌వైజర్ సులోచి, హెల్త్ అసిస్టెంట్ వి. జనార్ధనరావు, వి.హెచ్.సీ. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాభావంలో పంటల మార్పు చేయండి తక్కువ నీటి పంటల సాగు చేయండి.




**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 10 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ వి. జయలక్ష్మి సూచించారు.నంద్యాల మండలం పుసులూరు, మిట్నాల, కొత్తపల్లి గ్రామాల్లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని 29 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అధిక నీరు అవసరమయ్యే వరి, మొక్కజొన్నకు బదులుగా మినుము, కంది, జొన్న వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు.నీటిని పొదుపుగా వినియోగించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను అవలంబించి పంటలకు కీలక దశల్లో మాత్రమే నీరందించాలని తెలిపారు. నేలలో తేమ తక్కువగా ఉన్న సమయంలో పోషకాలను పైపాటుగా పిచికారీ చేయడం ద్వారా వర్షాభావ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కే. అశోక్ కుమార్, డాక్టర్ బి. రవి ప్రకాష్ రెడ్డి, డాక్టర్ పులి బాయ్, డాక్టర్ వై. గౌతమి, మండల వ్యవసాయ అధికారి ఈ. ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

# మద్యం విక్రయాలపై నియంత్రణ ఏది..?

### ఏపీలో మద్యపానం పెరుగుతోంది.. బెల్ట్ షాపులను రద్దు చేయాలి: పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



**పోరుమామిళ్ల , ఆగస్టు 10 (నంది పత్రిక)**ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం విక్రయాలు, మద్యపానం పెరిగిపోయాయని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఆరోపించారు. బెల్ట్ షాపులు, హోటళ్లు, దాబాలు, కూల్‌డ్రింక్ షాపులు, హైవేల వెంట మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, బస్సులు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఎంతో ప్రేమతో పెంచి, తమ పిల్లలు భవిష్యత్తులో ప్రయోజకులవుతారని ఆశిస్తే, కొందరు యువత మద్యానికి బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు.మద్యానికి డబ్బులు లేక ఇంట్లోనే దొంగతనాలకు పాల్పడటం, మద్యం సేవించి తల్లిదండ్రులపై దాడులు చేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వివాహితులు మద్యం సేవించి భార్య, పిల్లలపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మద్యం దుకాణాల సంఖ్యను 4,380 నుంచి 2,934కు తగ్గించినట్లు నాగార్జున రెడ్డి తెలిపారు. అప్పట్లో మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే నిర్వహించేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం దుకాణాలు, బార్ల సంఖ్య పెరిగిందని, ప్రభుత్వానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయం కూడా భారీగా పెరిగిందని ఆరోపించారు.ప్రస్తుతం ఉదయం 6 గంటల నుంచే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, రాత్రి 11 గంటల వరకు షాపులు తెరిచి ఉంటున్నాయని ఆయన విమర్శించారు. బెల్ట్ షాపుల విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీసులు మద్యం అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.అతిగా మద్యం సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తి చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యంగా కాలేయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. మద్యం కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీస్తుందని అన్నారు. ఇప్పటికైనా మహిళలు మేల్కొని గతంలో మాదిరిగా ఉద్యమించి బెల్ట్ షాపుల రద్దు కోసం పోరాటం చేయాలని నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి మద్యం నియంత్రణ కోసం పోరాడాలని, మన కుటుంబ సభ్యులను మనమే కాపాడుకోవాలని ఆయన కోరారు.

## నగరపాలక సంస్థకు 22 వినతులు.

### కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి .



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 10 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 22 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 8 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 14 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు.కాగా సంజీవయ్య నగర్ నందు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు చర్యలు తీసుకోవాలని, కర్ణాల వీధిలోని మా షాపు కు బిఎం కనెక్షన్ లేకున్నా పన్ను వస్తోంది పరిశీలించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, ఎస్టివి నగర్ లో తెలుగు గంగ నీరు సక్రమంగా సరఫరా చేయాలని, తిమ్మినాయుడు పాలెంలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, సుందరయ్య నగర్ నందు భూగర్భ డ్రైనేజి ఏర్పాటు చేయాలని, సప్తగిరి నగర్ నందు రోడ్లలో గుంతలు పూడ్చాలని, కాలువలు శుభ్రం చేయాలని, కోటకొమ్మల వీధిలో వాలి పోయిన చెట్టును తొలగించాలని, ప్రభుత్వ గృహం కొరకు చెల్లించిన డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, సెక్రటరీ శ్రీ విద్య, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, డి.ఈ.లు ఏసీపీ పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్ గురువారెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసీమ్, శానిటరీ సూపర్ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

**మహానంది ఆగస్టు 10 (నంది పత్రిక):–** ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఈవో ఎన్.శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం మహానంది క్షేత్ర పరిసర ప్రాంతాలను పరిశీలించారు.భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని దేవస్థానం సిబ్బందికి సూచించారు. ఆయన వెంట టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, మనోజ్ లు ఉన్నారు.



# ఆళ్లగడ్డ పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ







## మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రారెడ్డి

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 10 నంది పత్రిక**ప్రభుత్వ ఉద్యోగ నియామకాలన్నింటిలో మెరిట్ జాబితాను పారదర్శకంగా బయటపెట్టాలని, డీఎస్సీ2025 ఉపాధ్యాయ నియామకాల్లో మెరిట్ లిస్ట్ ఎందుకు ప్రకటించలేదో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ప్రశ్నించారు.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు డీఎస్సీ అక్రమాలు, నిరుద్యోగులకు జరిగిన అన్యాయంపై మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువజన విభాగం నాయకులు, నిరుద్యోగులు డీఎస్సీ అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ ర్యాలీ, మాజీ ఎమ్మెల్యే గంగుల నివాస కార్యాలయం నుండి ప్రారంభమై పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతను, నిరుద్యోగులను దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేసి. డీఎస్సీ నియామకాలను నిజాయితీగా చేపట్టి ఉంటే మెరిట్ లిస్ట్ విడుదల చేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏంటని నిలదీశారు. “మా సవాల్‌ను స్వీకరించి మంత్రి నారా లోకేష్ తక్షణమే మెరిట్ లిస్ట్‌ను బహిర్గతం చేయాలి. స్పోర్ట్స్ కోటాలో ఏ ప్రాతిపదికన, ఏ మెరిట్ ప్రకారం ఉద్యోగాలు కేటాయించారో స్పష్టం చేయాలి“ అని డిమాండ్ చేశారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన ప్రతిభావంతులైన అభ్యర్థులను తాము తప్పుపట్టడం లేదని, వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నామని... కానీ పారదర్శకత లేకపోవడం వల్లే నిజమైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, రాష్ట్ర వైకాపా మైనారిటీ నాయకులు షేక్ బాబూలాల్, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్ర రెడ్డి వీరభద్రుడు ,అమర్నాథ్ రెడ్డి, వైకాపా నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, నరసింహులు, పలచని మల్లికార్జునరెడ్డి నిజాం వలి, మాదం చెన్నయ్య, గుర్రప్ప, నా సారీ వెంకటేశ్వర్లు వైస్ ఎంపీపీ నాసారీ లక్ష్మీనరసింహ ప్రసాద్, ఆరు మండలాల వైకాపా నాయకులు కార్యకర్తలు గంగుల అభిమానులు తదితరులు పాల్గొన్నారు. .



# మహానంది క్షేత్రంలో భక్తులు భక్తిశ్రద్ధలతో మహా ప్రదిక్షణ



**మహానంది ఆగస్టు 10 (నంది పత్రిక):-** మహానంది క్షేత్రంలో భక్తులు భక్తిశ్రద్ధలతో మహా ప్రదిక్షణ కార్యక్రమం చేపట్టారు.సోమవారం సందర్భంగా మహానంది ఆలయం,ముఖ మండపం,ఆలయ మాడవీధుల్లో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు,హిందూ సంస్థల సభ్యులు,ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రం జపిస్తూ ప్రదక్షిణలు గావించి,భక్తి గీతాలు ఆలపించారు.అనంతరం వారు శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# డీఎస్సీలో అవకతవకలపై సిబిఐ విచరణ చేపట్టాలి : డాక్టర్ సుధీర్ దార




**నందికొట్కూరు ఆగష్టు 10( నంది పత్రిక)** డీఎస్సీలో లీకేజీ అక్రమాలపై సిబిఐ విచారణ చేపట్టి , కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు తెచ్చిన హామీల్లో నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని, డీఎస్సీలో అవకతవకలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని నందికొట్కూరు వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డాక్టర్ సుదీర్ ధార డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో వైఎస్ఆర్సిపి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ దార ఆధ్వర్యంలో డీఎస్సీ లో జరిగిన లీకేజ్ అక్రమాలను నిరసిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. నిరసనలో బుడ్డా శేషారెడ్డి పాల్గొన్నారు. ముందుగా వైఎస్ఆర్సిపి కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి మిడుతూరు రోడ్డు మీదుగా అంబేద్కర్ సర్కిల్ కు చేరుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి డాక్టర్ సుదీర్ దారా, బుడ్డా శేషారెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ సుధీర్ దార మాట్లాడుతూ గత డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా నిర్వహించిన పరీక్ష ఫలితాలలో లీకేజీ తో అక్రమాలకు పాల్పడి ఎంతోమంది నిరుద్యోగుల భవిష్యత్తు తో కూటమి ప్రభుత్వం ఆడుకుందని ఆరోపించారు. డీఎస్సీలో జరిగిన అక్రమాలపై తక్షణమే సిబిఐ విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.అక్రమాలపై చిత్తశుద్ధి ఉంటే బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ అహ్మద్, మైనార్టీ రాష్ట్ర నాయకులు జబ్బర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు పుల్యాల నాగిరెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు,మాజీ సొసైటీ చైర్మన్ వైవి రమణ,ఎస్సి సేల్ నియోజకవర్గం అధ్యక్షులు మార్కెట్ రాజు, మాజీ కౌన్సిలర్ షేక్ నాయబ్,రాహూఫ్,పట్టణ అధ్యక్షులు చరణ్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఉస్మాన్,విద్యార్థి యువజన సంఘం నాయకులు మాధురి గౌడ్, అబ్దుల్లా,లడ్డు (హిదయాతుల్లా )మరియు నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



# మోడీ హటావో దేశ్ బచావో: సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జైల్ భరో

**నందికొట్కూరు ఆగష్టు 10(నంది పత్రిక )** వామపక్షాల కిసాన్ మోర్చా పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో నందికొట్కూరులో జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. అల్లూరు రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు సర్కిల్, పటేల్ సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలిపి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, నందికొట్కూరు ఎస్సై చంద్రశేఖర్, మిడుతూరు ఎస్సై ఓబులేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.అనంతరం సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి రైతులకు జ2+50 శాతం ప్రాతిపదికన గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.35,000 పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు




రూ.40,000 పరిహారం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, కౌలు రైతులకు రుణాలు, పరిహారం అందించాలని తెలిపారు. 60 ఏళ్లు దాటిన రైతులు, వ్యవసాయ కూలీలకు నెలకు రూ.10,000/- పెన్షన్, ఉపాధి హామీలో 200 రోజుల పని, రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యను కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడాలని, పేపర్ లీకేజీలను అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యమకారులు, విద్యార్థులు, యువతపై దాడులను ఖండిస్తూ, ప్రజా ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదన్నారు. దేశంలో పెరుగుతున్న అసమానతలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి రైతు సంఘం నాయకులు వేల్పుల ఏసన్న అధ్యక్షత వహించగా, జిల్లా పార్టీ నాయకులు, టి నరసింహులు వడ్డే సుధాకర్ మేకల చంద్రశేఖర్ గుంపుల త్యాగరాజు ఇక్కిలి మాధవ నాయుడు బిగ్ బజార్ నాయుడు ఎం లక్ష్మన్న మీనిగా మహేష్ నాయుడు బి వెంకటరమణ మహిళా నాయకురాళ్లు, జిల్లా మహిళా సంగం కార్యదర్శి. ఎస్ బి బి అధ్యక్షురాలు బి లక్ష్మీదేవి షేక్ నవ్య సాని నూర్జహాన్ ముర్తుజావి సుబ్బమ్మ తదితరులుకార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానంపై విస్తృత అవగాహన కల్పించాలి

## ఆర్గాన్ డొనేషన్ కేవలం వైద్య ప్రక్రియ కాదు.. మరణానంతరం మరొకరి జీవితంలో వెలుగులు నింపే మహోన్నత సేవ”

## ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 10(నంది పత్రిక):-** జిల్లాలో అవయవ దానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, మరింత మంది అవయవ దానానికి ముందుకు వచ్చేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. పీజీఆర్ఎస్ హాల్ ముందు ఏర్పాటు చేసిన ‘ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్’ సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ ఫోటో దిగి, అవయవ దానానికి అంగీకారం తెలుపుతూ దరఖాస్తును పూరించి రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించేందుకు ఏర్పాటు చేసిన అవగాహన సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, “అవయవ దానం కేవలం ఒక వైద్య ప్రక్రియ కాదు.. మరణానంతరం కూడా మరొకరి జీవితానికి ఆశను అందించే మహోన్నత సేవ. ఒకరి అవయవ దానం మరొక కుటుంబంలో వెలుగులు నింపగలదు” అని అన్నారు. మరణానంతరం శరీరం మట్టిలో కలిసిపోయే బదులు, అవయవ దానం ద్వారా




పలువురికి జీవనాన్ని అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడే అవకాశం ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. అవయవ దానంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ అంగీకార పత్రాన్ని పూరించి తమ పేరును నమోదు చేసుకోవడంతో పాటు, ‘ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్’ సెల్ఫీ పాయింట్ వద్ద తమ మద్దతును తెలియజేయాలని కలెక్టర్ కోరారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు పీజీఆర్ఎస్ హాల్ వద్ద ప్రత్యేక సెల్ఫీ స్టాండ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పీజీఆర్ఎస్ హాల్‌లో రెడ్‌క్రాస్ రూపొందించిన అవయవ దాన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం అధికారులకు అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన లెక్చరర్ బి. సురేష్ కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవయవ దానానికి సంబంధించిన విధానం, ప్రాముఖ్యత, అపోహలు, అవయవ దాతలుగా నమోదు చేసుకునే ప్రక్రియ తదితర అంశాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**200 మందికి పైగా అవయవ దానానికి అంగీకారం**

అవయవ దానంపై నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిపి 200 మందికి పైగా అవయవ దానానికి అంగీకారం తెలుపుతూ నమోదు చేసుకున్నారు. అనంతరం వారు ‘ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్’ సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగి అవయవ దానానికి తమ మద్దతును చాటుకున్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కూడా అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవయవ దానం ద్వారా సమాజానికి అందించగల సేవ, అవయవ దానంపై ఉన్న అపోహలు, దాతలుగా నమోదు చేసుకునే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు.

# మహానంది పుణ్యక్షేత్రంలో వైభవంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం



**మహానంది ఆగస్టు 10 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో వైభవంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం నిర్వహించారు. సోమవారం,ఆరుద్ర నక్షత్రం, త్రయోదశి సందర్భంగా గర్భాలయం ఎదురుగా కొలువైన నందీశ్వరునికి ప్రదోషకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ వేదపండితులు,అర్చకులు గణపతి పూజ,పీఠార్చన, ద్రవ్య పూజలు చేశారు. పంచామృతం, వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో పాటు జలాభిషేకం,పాలాభిషేకం, మహా వైభవంగా నిర్వహించారు.పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా నందీశ్వర అభిషేకం పూజల్లో పాల్గొన్నారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## ట్రంప్ సర్కార్ సంచలనం.. 1.75 లక్షల విదేశీ వీసాలు రద్దు!

అమెరికా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. జాతీయ భద్రత, చట్టాల ఉల్లంఘన వంటి కారణాలతో విదేశీయులకు జారీ చేసిన సుమారు 1,75,000కు పైగా వీసాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన నిరంతర సమీక్ష ప్రక్రియలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ సోమవారం విడుదల చేసిన ‘ఫ్యాక్ట్ షీట్’లో వెల్లడించింది.

నేరపూరిత కార్యకలాపాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనల ఉల్లంఘన, మోసపూరిత వ్యవహారాలు, జాతీయ భద్రతకు విఘాతం కలిగించడం, అమెరికన్లపై హింసకు ప్రేరేపించడం వంటి కారణాలతో ఈ వీసాలను రద్దు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. దర్యాప్తు సంస్థలు అందించిన సమాచారం ప్రాతిపదికన అత్యధిక వీసాల రద్దు ప్రక్రియ చోటుచేసుకుంది. వీటిలో ప్రధానంగా డ్రైవింగ్ అండర్ ఇన్‌ఫ్లుయెన్స్ (ఆఖ×), దాడులు, చోరీలు, మాదకద్రవ్యాల విక్రయాలు వంటి నేరాలు ఉన్నాయి. ఈ ఫ్యాక్ట్ షీట్‌లో మరికొన్ని తీవ్రమైన కేసులను సైతం ప్రస్తావించారు. అత్యాచారం, కిడ్నాపింగ్, మానవ అక్రమ రవాణా, చిన్నారులపై లైంగిక వేధింపులు వంటి తీవ్ర నేరాలకు పాల్పడిన వారి వీసాలను తక్షణమే రద్దు చేశారు. అలాగే కేవలం తమ సంతానానికి అమెరికా పౌరసత్వం లభించేలా చూసేందుకు వచ్చే ‘బర్త్ టూరిజం‘ బాధితుల వీసాలను కూడా రద్దు చేశారు. విదేశాంగ విధానాల దృష్ట్యా క్యూబా, ఇరాన్, లావోస్, కువైట్‌కు చెందిన పలువురి వీసాలను రద్దు చేసినట్లు విదేశాంగ మంత్రి మార్కో రూబియో వివరించారు. “అమెరికా వీసా అనేది హక్కు కాదు, అది కేవలం ఒక విశేష అవకాశం మాత్రమే“ అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను దుర్వినియోగం చేసే వారి నుంచి అమెరికా సమాజానికి రక్షణ కల్పించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వీసా కేవలం అమెరికా భూభాగంలోకి ప్రవేశించేందుకు ఇచ్చే అనుమతి పత్రం మాత్రమేనని, దేశంలోకి అనుమతించాలా లేదా అనే తుది నిర్ణయం ఇమ్మిగ్రేషన్ అధికారులకే ఉంటుందని స్పష్టం చేసింది.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నేషన్ బిల్డింగ్‌లో భాగస్వాములు' కావాలి

### దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి
### ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లాలో విస్తృతంగా 'నేషన్ బిల్డింగ్' కార్యక్రమాలు
### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 10(నంది పత్రిక):–** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నేషన్ బిల్డింగ్‌లో భాగస్వాములు' (పార్ట్‌నర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్) ప్రచార కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ప్రజల భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దేశ నిర్మాణం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను గుర్తించి చురుకుగా భాగస్వామి కావాలని పేర్కొన్నారు.

**హర్ ఘర్ తిరంగా.. ప్రతి ఇంటా జాతీయ పతాకం**

ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ఇల్లు, వాణిజ్య సంస్థ, ప్రభుత్వ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల తరఫున అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే జెండా ఎగురవేయడం కాకుండా, ప్రజలతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి వారిలో దేశభక్తి భావనను మరింతగా పెంపొందించాలని సూచించారు.

**ఆగస్టు 14న భారీగా మొక్కలు నాటే కార్యక్రమం**

ఆగస్టు 14న జిల్లావ్యాప్తంగా ఒకేరోజు విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అటవీ, ఉద్యానవన శాఖల సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోని ప్రముఖ ప్రదేశాలు, ఇతర అనువైన ప్రాంతాలతో పాటు ప్రజలు తమ ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటేలా ప్రోత్సహించాలన్నారు. మొక్క నాటే సమయంలో జాతీయ పతాకాన్ని చేతబూని, దేశ నిర్మాణంలో తాము అందించదలచిన కృషిపై ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షిస్తూ, తమ లక్ష్యం, భవిష్యత్ దిశకు గుర్తుగా దాన్ని పెంచేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, సందేశాలను సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

**త్రివర్ణ కాంతులతో ప్రభుత్వ భవనాల అలంకరణ**

ఆగస్టు 14, 15 తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ భవనాలు, ప్రధాన ప్రదేశాలను జాతీయ పతాకంలోని మూడు రంగుల విద్యుత్ కాంతులతో అలంకరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

**పాఠశాలల్లో 'అనే నేను'.. భవిష్యత్‌పై విద్యార్థుల ప్రతిజ్ఞ**

ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల ద్వారా 'అనే నేను' కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో తాము ఏమి కావాలనుకుంటున్నారు, రాష్ట్రం, దేశ నిర్మాణంలో తాము ఎలాంటి పాత్ర పోషించాలనుకుంటున్నారు అనే అంశాలపై స్వయంగా ఆలోచించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒకే విధమైన ప్రతిజ్ఞను చేయకుండా, తన ఆసక్తి, లక్ష్యం, ఆలోచనలకు అనుగుణంగా దేశ నిర్మాణానికి తాను అందించదలచిన సేవను స్వయంగా పేర్కొనేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఉత్తమమైన, స్ఫూర్తిదాయకమైన ప్రతిజ్ఞలను ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రస్తావిస్తూ విద్యార్థులను ప్రోత్సహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.



# జ్ఞాన జ్యోతి పై శిక్షణ...

**చాగలమర్రిఆగస్టు 10 నంది పత్రిక** రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓల పర్యవేక్షణలో జ్ఞాన జ్యోతి పై అంగన్వాడి టీచర్లకు ఆరు రోజులపాటు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 11 నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సూపర్వైజర్ సుశీల సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణలో ఈసీసీఈ జాతీయ విద్యా విధానం, ప్రారంభ సంవత్సరాల్లో పిల్లల మెదడు అభివృద్ధి అభ్యసన సామాగ్రి రూపకల్పనతో పాటు పాఠశాల సంసిద్ధంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనుబంధ పోషణ,ప్రీస్కూల్ , పోషకాహార ఆరోగ్య విద్యపై అవగాహన, రోగ నిరోధకత, ఆరోగ్య పరీక్షలు తదితర వాటిని సంబంధిత రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరై శిక్షణ ఇస్తారన్నారు. ఈనెల 11 నుంచి ప్రారంభించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆళ్లగడ్డ ప్రాజెక్టు అధికారిని తేజస్విని పర్యవేక్షిస్తారని ఆమె తెలిపారు.

## ఆళ్లగడ్డ మాజీ శాసనస భ్యులు గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి భారీగా బయలుదేరిన కామినేని పల్లె మాజీ గ్రామ సర్పంచ్.



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కామినేని పల్లె గ్రామం నుండి ఆళ్లగడ్డలో మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి నిర్వహించిన ర్యాలీకి భారీగా కామినేని పల్లె గ్రామ సర్పంచ్ మేర్వ చిన్న నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు భారీగా సుమారు 4 ,5 వాహనాలలో పాటు బైకుల పై సుమారుగా వందమంది పైగా జై జగన్ జై గంగుల అనే నినాదాలతో కామినేని పల్లె గ్రామం అంతా మారు మోగుతూ వైఎస్ఆర్సిపి నాయకులు బయలుదేరారు.

## స్వచ్ఛ భారత్ మిషన్( గ్రామిణ్) ర్యాలీ



**శిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని మహదేవపురం గ్రామపంచాయతీలో స్వచ్ఛ భారత్ గ్రామీణ మిషన్ పై విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజా చైతన్యాన్ని కల్పించారు. తడిచెత్త పొడిచెత్త వేరు చేసి పొడి చెత్త ను స్వచ్ఛ రథానికీ తడిచెత్త ను గ్రీన్ అంబాసిడర్ లకు ఇవ్వండి, మరియు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వాడుకోవాలని ఆరుబయట మల విసర్జన చేయరాదని విద్యార్థులు స్లొగన్స్ ఇవ్వడం జరిగింది. అనంతరం స్వచ్ఛభారత్ మిషన్ డిస్టిక్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత లో భాగంగా భోజనానికి ముందు మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి అని తెలపడం జరిగినది మండల కోఆర్డినేటర్ ఎం. అబ్దుల్ కరీం పొడి చెత్తను స్వచ్ఛ రథానికి ఇవ్వడం ద్వారా పిల్లలకు ఇష్టమైన బిస్కెట్ ప్యాకెట్స్, పెన్సిల్స్, పెన్నులు, రబ్బర్లు ఇతర గృహ ఉపయోగకరమైన వస్తువులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బట్టు వెంకటరమణ తడి చెత్తను గ్రీన్ అంబాసిడర్ ఇవ్వడం ద్వారా తడి చెత్తతో మంచి సర్వంతమైన వర్మి కంపోస్ట్ తయారు చేయడం జరుగుతుందని తెలియజేశారు ఈ అవగాహన ర్యాలీలో గ్రామస్తులు, పాఠశాల , సచివాలయ, హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొనడం అయినది.

# నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకూ పోరాటం.. మాజీ ఎమ్మెల్యే









## కోవెలకుంటలో వైసీపీ శ్రేణుల భారీ ర్యాలీ

**కోవెలకుంట్ల ఆగష్టు 10నందిపత్రిక** ఉపాధ్యాయ ఉద్యోగాల్లో జరిగిన అక్రమాలకు బలైపోయిన నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం ఆగదని మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి అన్నారు సోమవారము మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వము నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యోగాల్లో జరిగిన అవినీతి అక్రమాల కు నిరసనగా కోవెలకుంట్ల పట్టణంలో మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీ పాండురంగ స్వామి ఆలయం నుండి నాగుల కట్ట వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము మెగా డీఎస్సీ పేరుతో నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యోగాలలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కష్టపడి చదివి మంచి మెరిట్ వచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా పేకాట ఆడే వారికి టిడిపి కార్యకర్తలకు ఎటువంటి డిగ్రీలు లేని టెట్ ఎగ్జామ్ రాయని వారికి టీచర్ పోస్టులు ఇచ్చి కష్టపడి చదివిన ఉపాధ్యాయ ఉద్యోగులను మోసం చేశారని ధ్వజమెత్తారు ఈ అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని ముందుగా అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో నియోజకవర్గ పరిశీలకుడు భూమా కిషోర్ కుమార్ రెడ్డి,వైఎస్సార్సీపీ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్ రెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,అవుకు,కోవెలకుంట్ల,బనగానపల్లె మండల కన్వీనర్లు కాటసాని తిరుపాల్ రెడ్డి, బీవీ నాగార్జున రెడ్డి,వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని మాట్లాడారు.నాగులకట్ట వద్ద కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగాల్లో జరిగిన అన్యాయాల పై ఎవరైనా సంఘీభావంగా రిలే దీక్షలో పాల్గొంటారన్న ఇంగితజ్ఞానం కూడా నీకు తెలియదా అని మంత్రి బీసి ని ప్రశ్నించారు.

విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రజలకు సమాధానం చెప్పాలి కదా....నీవు ఎందుకు మాట్లాడుతున్నావు రిలే దీక్షలో పాల్గొన్న వారిని టెర్రరిస్ట్ లా వారి ఫోటోలు పెట్టి చూపిస్తున్నావు అన్యాయం జరిగితే మద్దతు తెలపడం టెర్రరిజామా అని ప్రశ్నించారు.

**డిఎస్సి అక్రమాల పై సిబిఐ ఎంక్వైరీ వేయాలి....**

ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సిబిఐ ఎంక్వైరీ జరగాలని మాజీ శాసనసభ్యులు అన్నారు. ప్రజాస్వామ్యము నీకు ఇప్పుడే గుర్తుకు వచ్చిందా నీకు అని బీసి ని ప్రశ్నించారు.నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు నేను రాజీనామా చేయాలని నీవు చెప్పినప్పుడు లేదా ప్రజాస్వామ్యం అప్పుడు నన్ను ప్రజలు గెలిపించిన విషయాన్ని మరిచిపోయావా?2029 ఎన్నికల్లో శాశ్వతంగా రాజకీయాల్లో నిన్ను సమాప్తం చేస్తామన్నారు ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పోరాటాలు చేసే హక్కు ఏ పార్టీ కైన ఉంటుంది... ప్రతి సమస్య పై ప్రశ్నించే హక్కు ప్రతి పక్షానికి ఉందన్న సంగతి తెలియకుండానే మంత్రి అయ్యావా అని ప్రశ్నించారు.డిఎస్సి విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు పోరాటాలు సాగిస్తామని అన్నారు.

## పి జి ఆర్ ఎస్ లో బుక్ ఏ కాల్ ద్వారా ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి మరింత చేరువ అవుతుంది

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం, బ్యూరో చీఫ్ ఆగష్టు 10 నంది పత్రిక** పి జి ఆర్ ఎస్ సమావేశం అనంతరం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ అంశాలపై సమీక్షించారు. సర్" ప్రక్రియలో భాగంగా జనరేట్ అయిన నోటీసులను సంబంధిత ఓటర్లకు త్వరితగతిన జారీ చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు.పి.జి.ఆర్.ఎస్.లో "బుక్ ఎ కాల్" ద్వారా ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి మరింత చేరువ అవుతుందని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.)లో భాగంగా "బుక్ ఎ కాల్" సేవను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పి.జి.ఆర్.ఎస్. వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఫ్రీ ఆడిట్ సజావుగా సాగుతున్నదని అన్నారు. దరఖాస్తుల ఎండార్స్మెంట్ విషయంలో జిల్లా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని తెలియజేశారు. పి జి ఆర్ ఎస్ కు సంబంధించి వివిధ శాఖలలో పెండింగ్లో ఉన్న అన్ని దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి పూర్తి చేయాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఏ విషయంపై ప్రత్యేక దృష్టిని సారించాలని అన్నారు. లిలిజిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు విచ్చేసిన అనంతరం తమకు అందుబాటులో ఉన్న ప్రతి పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ప్రభుత్వ హాస్టల్స్, ప్రాథమిక వైద్యశాలలను తప్పక పరిశీలించాలని అన్నారు. దీనివలన ప్రభుత్వ శాఖల పనితీరు పట్ల ప్రజలకు పూర్తిస్థాయి నమ్మకం కలుగుతుందని అన్నారు.





పశ్చిమగోదావరి జిల్లాలో వరి పంట సాగు చేస్తున్న ప్రతి రైతు ఖరీఫ్ సీజన్ కు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద నమోదు చేసుకోవాలని అన్నారు. బీమా ప్రీమియం ఎకరాకు 210 రూపాయలు చెల్లిస్తే 42 వేల రూపాయలు బీమా మొత్తం పొందగలుగుతారని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షా భావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతాంగం ఆర్థికంగా నష్టపోకుండా మేలు కలిగించాలని ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంటబీమాను నమోదు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి రైతుకు పీఎం ఎఫ్. బి వై పథకంలో నమోదు అయి ఉండటం వలన తమ పంటకు భరోసా కలిగి నిర్భయంగా ఉండవచ్చని అన్నారు. రైతులు పంట రుణాలు కలిగి ఉంటే వాటిలోనే బీమా ప్రీమియం కూడా కలిపి మంజూరు చేయాలని అన్నారు. రైతులు ఎవరైనా బీమా ప్రీమియం చెల్లించ లేకపోతే ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాన్ని కల్పించి బీమా ప్రీమియం కట్టే విధంగా బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. భీమ ప్రీమియం చెల్లింపుకు ఆగస్టు 15వ తేదీ ఆఖరి రోజుఅని తెలియజేయడమైనదని అన్నారు. నవ చేతన " కార్యక్రమం ద్వారా 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారులకు సంభవించే దృష్టి, వినికిడి లోపాలను గుర్తించి వెంటనే చికిత్స అందించాలని అన్నారు. దీనివలన భావి భారత పౌరులైన చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసినట్టు అవుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు శాతం తక్కువగా ఉన్నదని, దీనిని అంగన్వాడి ఉపాధ్యాయులు పెంచేందుకు కృషి చేయాలని అన్నారు.పి జి ఆర్ ఎస్ సమస్యల పరిష్కార ప్రగతి మెరుగ్గా ఉన్నప్పటికీ మరింత అంకితభావంతో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. తదుపరి సమావేశం నాటికి సమస్యలను పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి పి ప్రభాకర్, డ్వామా పిడి డాక్టర్ కే సి హెచ్ అప్పారావు, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై దోసిరెడ్డి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు..

# ప్రజాసేవలోనే ఆనందం ఉంది... మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి

### రెండేళ్ల పాలనలో కోవెలకుంట్లలో ఎనిమిది కోట్ల రూపాయలతో అభివృద్ధి
### కోవెలకుంటలో ఇంటింటికి తెలుగుదేశం లో పాల్గొన్న మంత్రి

**కోవెలకుంట్ల ఆగష్టు 10 నంది పత్రిక** ప్రజలకు సేవ చేయడంలోనే ఆనందం ఉందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు సోమవారం సాయంత్రం కోవెలకుంట్ల పట్టణంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు ముందుగా పట్టణంలోని సంతపేటలో 2.8 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతపేటలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి ఈ రోజు కోవెలకుంట్లలో జరిగిన ర్యాలీ సందర్భంగా మాట్లాడిన మాటలపై దీటుగా సమాధానమిచ్చారు . నీవు రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్నావు నేను రెండోసారి ఎమ్మెల్యేనయి మంత్రిని అయ్యాను ఈ రెండేళ్ల పాలనా కాలంలో కోవెలకుంట్లలో నేను చేసిన అభివృద్ధికి నీ పదేళ్ల పాలనా కాలంలో నువ్వు చేసిన అభివృద్ధిని చర్చిద్దామా అని సవాల్ విసిరారు అన్ని ప్రజలు గమనిస్తున్నారని ఎవరు అభివృద్ధి చేస్తున్నారు ఎవరు ప్రజల కోసం పాటుపడుతున్నారని ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. వారికి సేవ చేయడంలోనే నాకు ఆనందం ఉందని అన్నారు

**నాయకులంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారు ప్రజలే నా నాయకులు.. మంత్రి**

కోవెలకుంట్లలో ఉన్న నాయకులు మాజీ సర్పంచ్ నాగార్జున రెడ్డి, కర్ర హర్షవర్ధన్ రెడ్డి తదితర నాయకులు గొడ్డలి పార్టీలోనే ఉన్నారని అయితే ప్రజలే నాకు నిజమైన నాయకులని వారి అభిమానంతోనే నేను ఎమ్మెల్యేగా తిరిగి గెలుపొందాలని మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోవెలకుంట్లలో 3400 ఓట్ల మెజార్టీతో నన్ను గెలుపు బాట పట్టించారని కోవెలకుంట్ల పట్టణంలో ఏ సందు ఏ వీధికి వెళ్ళినా నేను చేసిన అభివృద్ధి చూడాలని అక్కడికి వచ్చిన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో దీవించండి** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కోవెలకుంట్ల పట్టణం ప్రజలు నన్ను ఆశీర్వదించాలని అక్కడికి వచ్చిన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ కచ్చితంగా బీసీ జనార్దన్ రెడ్డి నిలబెట్టిన సర్పంచి గెలవాలని అందుకు మీరంతా నన్ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గడ్డం అమర్నాథ్ రెడ్డి గడ్డం నాగేశ్వరెడ్డి జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సార్) 2026 నోటీసులు, హియరింగ్ పై అవగాహన కలిగి ఉండాలి

## ప్రణాళిక ప్రకారం క్లెయిమ్స్ ,అబ్జెక్షన్స్ పూర్తి చేయాలి

## 80,140 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలి

## నోటీసు జారీ చేసిన తేదీ నుంచి కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండేలా హీరింగ్ తేదీ నిర్ణయించాలి

## జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా



**నంద్యాల బ్యూరో, ఆగస్టు10(నంది పత్రిక):-** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ సార్ )2026 ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసిన బిఎల్ఓ అధికారులను జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా అభినందించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల, బనగానపల్లి, డోన్ నియోజకవర్గాల బి ఎల్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, ఈ ఆర్ ఓ , బి ఎల్ తో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ సార్ )2026లో భాగంగా నోటీసుల జారీ, హియరింగ్ పై సమీక్షించిన జిల్లా కలెక్టర్.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తయినందున, తదుపరి దశలో క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు వాటిపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫారం-6, ఫారం-6ఏ, ఫారం-7, ఫారం-8 ద్వారా వచ్చే దరఖాస్తులను స్వీకరించి, వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించాలన్నారు.జిల్లాలో మొత్తం 14,05,443 మంది ఓటర్లతో సా×= ప్రక్రియ ప్రారంభించగా, 12,25,937 మంది (87.23 శాతం) ఓటర్లు నిజమైన ఓటర్లుగా గుర్తించబడ్డారని తెలిపారు. మిగిలిన వారిని అబ్సెంట్, పర్మనెంట్‌గా ఇతర ప్రాంతాలకు తరలిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లు నమోదు కావడానికి ఆసక్తి లేని వారు అనే ఐదు కేటగిరీలుగా గుర్తించినట్లు వివరించారు.ఈ కేటగిరీల్లో చేర్చిన ఓటర్ల నుంచి అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి అభ్యంతరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అటువంటి అభ్యంతరాలు వచ్చిన వెంటనే బి ఎల్ ఓ, ఏ ఈ ఆర్ ఓ స్థాయిలో నోటీసులు జారీ చేసి, విచారణ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా 2002 ఓటర్ల జాబితాతో స్వయంగా లేదా కుటుంబ సభ్యుల ద్వారా మ్యాపింగ్ చేయలేని 6,067 మంది ఓటర్లు (0.43 శాతం) ఉన్నారని తెలిపారు. వీరందరికీ కూడా నోటీసులు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మ్యాపింగ్ ప్రక్రియను ముందుగానే పూర్తి చేయడం వల్ల అధికారులపై పని భారం తగ్గుతుందని, ఆళ్లగడ్డ నియోజకవర్గం మ్యాపింగ్‌ను 100 శాతం పూర్తి చేసి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. నిజమైన ఓటర్లుగా గుర్తించిన 12,25,937 మందిలో 74,073 మంది ఓటర్ల డేటాలో లాజికల్ డిస్క్రిపెన్సీలు ఉన్నాయని తెలిపారు. మ్యాపింగ్ పెండింగ్‌లో ఉన్న 6,067 మందితో కలిపి మొత్తం 80,140 మందికి నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించాల్సి ఉందని చెప్పారు.ఒకవైపు నోటీసుల ప్రక్రియ, మరోవైపు క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన కొనసాగుతున్నందున అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఇప్పటికే నంద్యాల నియోజకవర్గంలో 5,182, బనగానపల్లెలో 3,051, డోన్‌లో 3,105 క్లెయిమ్స్ వచ్చినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో క్లెయిమ్స్, అభ్యంతరాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు.సార్ షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 3న ప్రచురించాల్సి ఉందని కావున , సెప్టెంబర్ 28 వరకు వేచి ఉండకుండా, సెప్టెంబర్ 10 నాటికే నోటీసులు, క్లెయిమ్స్, అభ్యంతరాలు, డిస్క్రిపెన్సీలకు సంబంధించిన పనులను వీలైనంత వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**నోటీసుల జారీలో 7 రోజుల గడువు తప్పనిసరి**

80,140 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసే సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నోటీసులో ఓటరు ఏ తేదీన, ఏ సమయానికి విచారణకు హాజరు కావాలో స్పష్టంగా పేర్కొంటూ హియరింగ్ షెడ్యూల్ ఇవ్వాలన్నారు. సహజ న్యాయ సూత్రాలను పాటించేందుకు నోటీసు అందించిన తేదీ నుంచి కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా హియరింగ్ తేదీని నిర్ణయించాలని ఆదేశించారు. నోటీసు జారీ చేసిన వెంటనే మరుసటి రోజే విచారణకు షెడ్యూల్ చేయడం సరికాదని స్పష్టం చేశారు.నోటీసులు జనరేట్ చేయడమే కాకుండా, అవి సంబంధిత ఓటరుకు వాస్తవంగా అందినట్లు కూడా నిర్ధారించుకోవాలని తెలిపారు. బి ఎల్ ఓ లు నోటీసులను అందజేసిన అనంతరం, నోటీసు డెలివరీకి సంబంధించిన ఆధారాలను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఏ ఈ ఆర్ ఓ లు నోటీసులు జారీ చేసే సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటించేలా ఈ ఆర్ ఓ లు వారికి తగిన మార్గదర్శకత్వం ఇవ్వాలని, ప్రతి దశను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. నోటీసు జారీ, హియరింగ్ షెడ్యూల్, నోటీసు డెలివరీ, డెలివరీ ఆధారాల అప్‌లోడింగ్ వంటి ప్రతి ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సార్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు న్యాయం జరిగేలా, పారదర్శకంగా మరియు నిబంధనలకు అనుగుణంగా విచారణ ప్రక్రియను పూర్తి చేసి తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు.

# వీల్ చైర్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 10 నంది పత్రిక**విభిన్న ప్రతిభావంతులైన పిప్పర మండలం గణపవరం గ్రామానికి చెందిన గుళ్ళ చిన్న మంగమ్మ 39 సంవత్సరములు, పాలకొల్లు కు చెందిన మేడిది శ్యామలత 44 సంవత్సరాలు, వీరు ఇద్దరూ గత వారంలో జరిగినప్రజా సమస్యల పరిష్కార వేదిక పి (జి ఆర్ ఎస్) లో వీల్ చైర్స్ కొరకు దరఖాస్తు చేసుకోగా సోమవారం జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జరిగిన పి జి ఆర్ ఎస్ సమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా వీల్ చైర్స్ ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు సానుకూల దృక్పథంతో పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వీల్ చైర్స్ అందుకున్న విన్న ప్రతిభావంతులు, పి జి ఆర్ ఎస్ ద్వారా తమ సమస్యను పరిష్కరించి అవసరమైన సహాయాన్ని అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, డి ఆర్ ఓ పీ ప్రభాకర్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి బి రామ్ కుమార్, డి ఆర్ డి ఎ పి డి పి వేణుగోపాల్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి...



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 10 నంది పత్రిక**భీమవరం పీపీ రోడ్డులోని ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ గోడౌన్స్ లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్కు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ప్రతి నెలలో ఒకసారి ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపడం జరుగుతుందని తెలిపారు. ఈవీఎం గోడౌను వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంలో డిఆర్ఓ పెంచల ప్రభాకర్, ఎలక్షన్ సెక్షన్ ఇంచార్జి సూపరింటెండెంట్ హెచ్ ఎన్ సి శేఖర్ ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకోండి





## రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## పీజీఆర్ఎస్‌లో 343 ప్రజా వినతులు స్వీకరణ

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 10(నంది పత్రిక):-** ప్రజల నుంచి అందుతున్న వినతులను సకాలంలో, నాణ్యతతో పరిష్కరించి ప్రజా సంతృప్తి పెంపొందించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వానికి తావు లేకుండా ప్రతి అర్జీపై బాధ్యతతో స్పందించాలని అధికారులను ఆదేశించారు. రీఓపెన్ దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిష్కరించబడినట్లు తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్ దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ, ఆలస్యం కారణాలను సంబంధిత అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అటవీ శాఖకు సంబంధించిన ఒక దరఖాస్తు నిర్దేశిత సేవా గడువు (ఎస్ఎల్ఏ) దాటిన అంశంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. అలాగే అధికారుల లాగిన్‌లో ఇంకా పరిశీలించని దరఖాస్తులను పరిశీలించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా అందుతున్న వినతులపైనా ప్రత్యేక దృష్టి సారించి, సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ కు సంబంధించిన వివరాలను వెంటనే నవీకరించాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 165 దరఖాస్తుల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలోనే భూ సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 165 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. వాటిలో రెవెన్యూ, స్వర్ణ గ్రామ/వార్డులకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 15, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 11, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 30, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 57, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 45, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 4 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) మిడ్తూరు మండలం, అలగనూరు గ్రామానికి చెందిన పి. శ్రీనివాసులు గౌడ్ కు గ్రామ పరిధిలో సర్వే నెం.121/32సిలో 3 ఎకరాల పొలం కలదని, సదరు భూమిని ఆన్లైన్ లో నమోదు చేయించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) కోవెలకుంట్ల మండలం, చింతకుంట గ్రామానికి చెందిన కొట్టం చిన్న రామన్నకు సర్వే నెం.132లో 1.78 ఎకరాల భూమి కలదని, సదురు భూమిని మ్యుటేషన్ చేయించి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.

3) ప్యాపిలి మండలం, మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఆర్.సుధాకర్, ఆర్.తిరుపాలు అనే రైతులు మెట్టుపల్లి గ్రామానికి చెందిన సర్వే నెం.397 క్రింద 6 ఎకరాల పొలం కలదని, సదురు పొలంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి సర్వే జరిగిందని,

ఆ పొలమే తమకు జీవనాధారం అని పొలంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

# అంతర్జాతీయ పారా క్రీడల్లో సత్తా చాటిన పశ్చిమ గోదావరి జిల్లా క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 10 నంది పత్రిక**థాయ్‌లాండ్‌లోని శ్రీరాచాలో ఏప్రిల్ 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన వరల్డ్ మాస్టర్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్స్2026లో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దివ్యాంగ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఛాంబర్ లో సోమవారం క్రీడాకారులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందించారు. ఈ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని జిల్లా నుంచి మరి కొంతమంది క్రీడాకారులు తయారవ్వాలని ఆమె ఆకాంక్షించారు. పారా అథ్లెటిక్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లాకు అత్తిలి గ్రామం చెందిన యడ్లపల్లి సూర్యనారాయణ, షాట్‌పుట్ ఎఫ్42 కేటగిరీలో బంగారు పతకం, జావెలిన్ త్రో ఎఫ్42 కేటగిరీలో కాంస్య పతకం సాధించారు. అలాగే పాలకొల్లు కు చెందిన మురపాక నళినిరాజశేఖర్ పారా పికిల్‌బాల్ పీపీ54 కేటగిరీలో కాంస్య పతకం, జావెలిన్ త్రో ఎఫ్54 కేటగిరీలో వెండి పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని ఆమె అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ఈ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారికి అర్హత మేరకు క్రీడా ప్రోత్సాహకాలు మంజూరు చేయించేందుకు అవసరమైన సిఫారసు చేసి, సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది క్రీడా రంగంలోకి వచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు స్ఫూర్తి లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భం లో జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# రంపచోడవరం లో ఘనంగా 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు'







**విజయవాడ బ్యూరో చీఫ్ ఫ్ ఆగస్టు 10 నంది పత్రిక**రంపచోడవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో "ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు" అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీషాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుండి జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించి, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మరియు ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.వేదికపై ఏర్పాటు చేసిన గిరిజన సంస్కృతి, సాంప్రదాయ కళలు, హస్తకళలు మరియు అటవీ ఉత్పత్తుల స్టాల్స్‌ను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారుల సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు గిరిజన క్రీడలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ & గౌరవ శాసనసభ్యులు మిరియాల శిరీషాదేవి గారు మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు, విద్య, హక్కులు మరియు గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మన ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం గిరిజన పెద్దలను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు మరియు క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వర రావు, చిన్నం బాబు రమేష్ ;కలెక్టర్ కొత్తమాసు దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ జీ. శివ కుమార్,రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ స్వాతి,ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి,ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యులు శ్రీ షేక్ సుభానీ, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీ గొల్లపూడి పెద్దిరాజు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీ పెంటపాటి అనంత మోహన్,నియోజక వర్గ ఎస్టీ విభాగ అధ్యక్షులు పండా బాపన్నదొర అనే బాబీ, సీతపల్లి గడి బాపనమ్మ చైర్మెన్ కుంజం బాపన్న దొర, ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర,సిద్దా వెంకన్నదొర, మాజీ సర్పంచ్ వై నిరంజనిదేవి, సూరిబాబు,మాజీ మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, గణపతి,గంగవరం మండలం మాజీ ఎంపీపీ తీగల ప్రభ, చైర్మన్ లోతా లక్ష్మణ రావు,గొర్లె నారాయణ రావు తదితర ప్రజాప్రతినిధులు మరియు నాయకులు హాజరయ్యారు.



# మహిళ దుస్తులను సాకుగా చూపి వేధింపులు.. ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు

మహిళలు ధరించే దుస్తులు వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశమని, వాటిని సాకుగా చూపి లైంగిక వేధింపులకు పాల్పడటాన్ని ఏమాత్రం సహించలేమని ఢిల్లీ హైకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఒక యువతిని లైంగికంగా వేధించిన కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ, నిందితుడిని దోషిగా నిర్ధారించింది. సాజిద్ అలీ అనే వ్యక్తి ఒక యువతిని కొంతకాలంగా వెంబడించడం, అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు ఆమెను భౌతికంగా తాకుతూ వేధింపులకు పాల్పడ్డాడు. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు నిందితుడిని నిర్దోషిగా విడుదల చేసింది.

# ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం, నాణ్యత, శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం





## పీజీఆర్ఎస్‌లో 190, రెవెన్యూ క్లినిక్‌లో 37 దరఖాస్తుల స్వీకరణ

## ప్రతి అర్జీని నిర్దేశిత గడువులో పరిష్కరించాలి.

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం బ్యూరో చీఫ్, ఆగస్టు 10 నంది పత్రిక** జిల్లాలో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు అత్యంత బాధ్యతతో పరిశీలించి, వేగవంతంగా, నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారి పి. ప్రభాకర్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి హెచ్ అప్పారావు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించి ముగింపు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యం, అలసత్వానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యల తీవ్రత, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు ఒకే సమస్యపై పదేపదే దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం అనంతరం సంబంధిత దరఖాస్తుదారుకు సమాచారం అందించడంతో పాటు సమస్య పూర్తిగా పరిష్కారమైందో లేదో కూడా ధృవీకరించాలని సూచించారు. ఈరోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 190 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌లో 37 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుడితి దుర్గారావు ఇరగవరం మండలం కాకిలేరు గ్రామం ప్రభుత్వ నిధులు తో నిర్మించిన ప్రజా ఉపయోగకరమైన డ్రైనేజీ ఆక్రమణకు గురి అయినది చర్యలు తీసుకోవాలని కోరారు. బయ్యే కృపఆశీర్వాదం భీమవరం మండలం యనమదురు గ్రామం నుండి ఏటువంటి ఆదాయము లేదు ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వాలని దరఖాస్తు లో కోరారు. వాసా లావణ్య పాలకొల్లు మండలం యాళ్ళవాని గరువు గ్రామం నుండి నివాసాలలో వాడకం నీరు రోడ్ల పైకి వదిలి వేస్తున్నారు. గ్రామ లో దోమలు పెరిగిపోయి ప్రజలు రోగాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. బాదంపూడి జయ కిషోర్ పెంటపాడు మండలం వల్లూరు పల్లి గ్రామం నుండి గ్రామంలో రహదారి సుమారు 18 అడుగులు ఆక్రమణకు గురి అయినది సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. కేతలక్ష్మి పాలకోడేరు మండలం మోగల్లు గ్రామము నుండి ఒంటరి మహిళ ను ప్రభుత్వం వారు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఉప్పె సత్యవతి పాలకొల్లు బద్దవానిపేట కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చిన కారణంగా వితంతు పింఛను ఆగిపోయినది ఏటువంటి ఇతర ఆదాయం లేదు పరిశీలించి పింఛను పునరుద్ధరణ చేయాలని చెయ్యాలని కోరారు. భీమవరం గునుపూడి 7వ వార్డు గాంధీనగర్ నుండి బందిల మరియమ్మ తన కుమార్తె శ్రావ్య గీతిక16 సంవత్సరాలు మానసిక వికలాంగురాలు నడవలేదు పింఛను మంజూరు చేయాలని కోరారు.

**వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక సూచనలు:-** వయోవృద్ధులు, వికలాంగులు, నడవలేని వారు తమ మండల స్థాయిలోని అధికారులకు నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. వారి సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా అధికారులు వయోవృద్ధుల సంక్షేమం ట్రిబునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, అర్జీదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌లో విషాదం.. వాగులో కొట్టుకుపోయిన వ్యాన్, 9 మంది జలసమాధి

### మధ్యప్రదేశ్‌లో పొంగిపొర్లుతున్న వాగులో వ్యాన్ కొట్టుకుపోయిన వైనం

### ఈ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు సహా 9 మంది మృతి

### హెచ్చరికలను పట్టించుకోకుండా డ్రైవర్ ముందుకు వెళ్లడంతో ఘటన

### మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం

మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో సోమవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ వ్యాన్ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులో కొట్టుకుపోవడంతో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా ఈది ఒడ్డుకు చేరుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, దేవస్ జిల్లా ధన్‌సద్ గ్రామానికి చెందిన 11 మంది ప్రయాణికులు ఓ వ్యాన్‌లో కడ్లవాడ్‌కు వెళుతున్నారు. పచోర్-సారంగ్‌పూర్ రహదారిపై పాడ్నా సమీపంలో ఉదయం 9:30 గంటల సమయంలో ఘిరి వాగు వద్దకు చేరుకున్నారు. భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. వాగు దాటవద్దని స్థానిక గ్రామస్థులు, అధికారులు హెచ్చరించినా డ్రైవర్ వినిపించుకోలేదు. వ్యాన్‌ను ముందుకు నడపడంతో బలమైన నీటి ప్రవాహానికి అది కొట్టుకుపోయి క్షణాల్లో మునిగిపోయింది. సమాచారం అందుకున్న రాష్ట్ర విపత్తు స్పందన దళం ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో వ్యాన్‌ను బయటకు తీసింది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ముఖేష్ సింగ్, మరో ప్రయాణికుడు హుకుమ్ సింగ్ ప్రాణాలతో బయటపడగా, వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన చోట వంతెన నిర్మాణంలో ఉందని, దానిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతోనే ఈ దుర్ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి.



# భూ రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రిఫార్మ్స్









## వచ్చే 7 నెలల్లో 68.64 లక్షల పాస్ పుస్తకాల జారీ

## ఈ నెల వరకూ 32.22 లక్షల పుస్తకాలు రైతులకు అప్పగింత

## పట్టాదారు పాస్ పుస్తకాలకు టెక్నాలజీ రక్షణ కవచం

## పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ

## డీఎస్సీపై టీచర్లు తిరగబడినా గొడ్డలి పార్టీకి బుద్ధిరాలేదు

## రాష్ట్రంలో ప్రతీ ప్రాజెక్టు తామే కట్టానని కలలు కంటున్నారు

## కలిదిండిలో మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**కైకలూరు బ్యూరో చీఫ్, ఆగస్టు 10: నంది పత్రిక** గత పాలనలో అస్తవ్యస్తంగా మారిన భూమి రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రికార్డుల రిఫార్మ్స్ 2026 తీసుకొచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే అజెండాగా కూటమి ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. 2027 నాటికి రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మీ భూమి- మీ హక్కు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఇ-కేవైసీ పూర్తి చేసిన అనంతరం నల్లజర్ల దుర్గా భవానీ అనే మహిళా రైతుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాన్ని సీఎం జారీ చేశారు. రీసర్వే ప్రక్రియకు సంబంధించి కలిదిండిలో నిర్వహించిన గ్రామసభకు హాజరైనట్టుగా సీఎం రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ప్రజలు, రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్ వేగంతో అభివృద్ధి చేస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఇచ్చిన భూమిని 22ఏలో పెడితే దానిని పరిష్కరించి వారికి పట్టాలు ఇచ్చాం. మీ భూమి మీ హక్కు దానిపై ఇతరులు పెత్తనం చేయడానికి వీల్లేదు. పాస్ పుస్తకాలపై గత పాలకులు ఫోటోలు ఎలా వేసుకుంటారు. 2019-24 మధ్య గత పాలకులు చేసిన విధ్వంసం కారణంగా రెవెన్యూ రికార్డులు ధ్వంసం అయ్యాయి. వారికి ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని డిజిటల్ గా 22ఏలో పెట్టేసి వివాదాస్పదం చేశారు. 2024లో అధికారంలోకి రాగానే ఎక్కడికి వెళ్లినా భారీ ఎత్తున భూ ఫిర్యాదులు అందాయి. అప్పుడే వీటన్నిటినీ పరిష్కరించాలని నిశ్చయించుకున్నాం. ఒక్కొక్కటిగా వాటిని పరిష్కరిస్తున్నాం. సమస్యలు పట్టించుకోని వారికి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. గత పాలకులు బటన్ నొక్కటం, పరదాల చాటున రావటం, సభలు పెట్టి చెట్లు నరికేశారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలనే ప్రతీ నెలా సమావేశాల ద్వారా వారిని కలుస్తున్నాం. కరెన్సీకి ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టా దారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. వచ్చే ఏడు నెలల్లో 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేస్తాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రెవెన్యూ సంస్కరణలతో రైతులకు ప్రయోజనాలు** "ఇప్పటి వరకూ 41 వేల ఎకరాల మేర భూ సమస్యలు క్లియర్ చేశాం. దీని ద్వారా 1.27 లక్షల మందికి పైగా రైతులు, పరిశ్రమలు, ప్రజలకు ప్రయోజన కలిగింది. 1.36 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశాం. ప్రతీ రైతుకు, భూ యజమానికి రాజ ముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలు జారీ చేసే వరకూ విశ్రమించం. భూమి తమదైనా వేర్వేరు ఇబ్బందులతో రైతులు, భూ యజమానులు ఇప్పటి వరకూ సమస్యలు ఎదుర్కొన్నారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఏఆర్సీ, ఇనామ్, సీలింగ్ లాంటి పాత భూమి రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాం. లింక్ డాక్యుమెంట్లన్నీ ఆన్ లైన్ ద్వారా అందిస్తాం. భూ రికార్డులను చట్టబద్ధంగా నవీకరించి ధృవీకరించే ప్రక్రియను పకడ్బందీగా చేస్తున్నాం. 9 లక్షల మందికి ఇప్పటి వరకూ ఆటో మ్యూటేషన్ సౌకర్యం కల్పించాం. రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే చేసి ఈకేవైసీ తీసుకున్న తర్వాతే రాజముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలను ముద్రించి పంపిణీ చేస్తున్నాం. గ్రామ సభ నిర్వహించి పూర్తి పారదర్శకంగా పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలన్నదే మా ఉద్దేశం. వివాదాలు తగ్గి లావాదేవీలు పెరుగుతాయి. ఐటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అనుసంధానించి ప్రజలకు సులభంగా పౌర సేవలు అందేలా చర్యలు చేపట్టాం. కొల్లేరు వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించేలా రూ.36 కోట్లను కైకలూరుకు మంజూరు చేశాం. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పదేపదే మరమ్మత్తులు వచ్చే రహదారులకు కూడా శాశ్వత పరిష్కారం ఉండేలా సిమెంట్ రోడ్లు వేయాలని ఆలోచన చేస్తున్నాం. గత పాలనలో గోతులు పడిన రోడ్ల గురించి ప్రశ్నే బటన్ నొక్కామని సమాధానం ఇచ్చేవారు. గత పాలన తాలూకు విధ్వంసపు గడ్డు రోజులను అధిగమించి క్రమంగా అభివృద్ధివైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. 2019-24 మధ్య రాష్ట్రం ఆర్థికంగా ధ్వంసమైంది, ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధం లాంటి పరిస్థితులు ఆక్వా రంగాన్ని దెబ్బతీశాయి. కానీ కూటమి వచ్చాక ఆక్వాకు రూ.1.50 కు యూనిట్ చొప్పున రాయితీ విద్యుత్ ను జోన్ తో నిమిత్తం లేకుండా ఇస్తున్నాం. ప్రభుత్వానికి రూ.1150 కోట్ల అదనపు భారం పడినా.. దేశానికి ఆదాయం వచ్చేలా చేస్తున్న రైతుల కోసం దీనిని భరిస్తున్నాం. నాన్ ఆక్వా జోన్ పరిధిలోని 12,500 మంది రైతులకు కూడా కొత్తగా ఈ రాయితీ విద్యుత్ అమలు అవుతుంది." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**పరామర్శల పేరుతో గొడ్డలిపార్టీ నానాయాగీ** " ఓ దౌర్భాగ్యపు పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. నక్సల్స్ నాపై క్లైమోర్ మైన్స్ పేల్చినా కేవలం ప్రజల కోసమే రాజకీయాల్లో కొనసాగుతున్నాను. రాయలసీమలో ఫ్యాక్షన్, హైదరాబాద్‌లో మత విద్వేషాలను కూడా సమర్థంగా నియంత్రించాం. ఆ తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధి జరిగి సంపద పెరిగింది. అంతర్జాతీయ స్థాయి కంపెనీలు వచ్చాయి. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ వల్ల గంజాయి, రౌడీ బ్యాచ్ కారణంగా అరాచకాలు జరిగాయి. మేం అధికారంలోకి వస్తునే గంజాయి పంటను నిర్మూలించాం. దేవరపల్లి వద్ద పొగాకు రైతుల పరామర్శకు వెళ్లి నానా యాగీ చేశారు. స్వైర విహారం చేశారు. రోడ్లపై ప్రమాదకరంగా మోటారు సైకిళ్లతో సర్కస్ చేస్తూ భయపెడుతున్నారు. రైతుల పొగాకు మొత్తం తొక్కించారు. పొగాకు కేజీకి రూ.10 చొప్పున సబ్సీడీ ఇవ్వటంతో పాటు బ్యారెన్ కు రూ.50 వేల రుణం ఇప్పించేలా కేంద్రంతో మాట్లాడాం. తప్పు చేస్తే మా పార్టీ వ్యక్తులైనా చర్యలు తీసుకుంటున్నాం. గుంటూరులో ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించారని టీడీపీ నేతను సస్పెండ్ చేశాం. కేసు పెట్టి విచారణ చేస్తున్నాం. శ్రీకాకుళంలో ఓ మాజీ మంత్రి కొడుకు బైక్ తో గుద్ది ఓ వ్యక్తిని చంపేస్తే అతన్ని పరామర్శించడానికి గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వెళ్లి అరాచకం చేశారు. ప్రధాన మంత్రి పర్యటన ఓ వైపు ఉంటే రోడ్లపై గంటలు గంటలు ర్యాలీ చేశారు. ఓ మహిళా పోలీసు అధికారిపై దాడి చేశారు. తిరిగి పోలీసులపై నెపం వేశారు. మెగా డీఎస్సీ ద్వారా 15 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తే దానిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పూర్తి మెరిట్ తో ఉద్యోగాలు సంపాదించిన యువతను కించ పరిచేలా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోంది. ఢిల్లీలో నీట్ పరీక్ష పేపరు లీక్ అయితే..ఇక్కడ కూడా లోకేష్ రాజీనామా చేయాలని అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారు. మెగా డీఎస్సీ లో ఉద్యోగాలు పొందిన టీచర్లు రోడ్లపైకి వచ్చి ర్యాలీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. పాఠాలతో పాటు గుణపాఠాలు కూడా చెబుతామని వాళ్లు హెచ్చరించారు. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా టీచర్లు ఆందోళన చేశారు. ఇంత చేసినా ఆ పార్టీకి బుద్ధిరావటం లేదు. ఇంకా ఆందోళన చేస్తాం, రోడ్లపై స్వైరవిహారం చేస్తామంటున్నారు. రప్పా రప్పా అంటూ గొడ్డలి పార్టీ రౌడీలు, గంజాయి బ్యాచ్ లు ప్రజలకు నిద్ర లేకుండా చేస్తారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కడితే అది నేనే కట్టాను అంటున్నాడు. పోలవరం పూర్తి అయితే అది కూడా నేనే చేశానంటాడు. అమరావతి నిర్మిస్తే అది కూడా నేనే అంటాడు. అభివృద్ధి పనులు పూర్తి చేసి మేం ఆనందిస్తుంటే.. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు విధ్వంసం చేసేసి ఆరోపణలు చేస్తున్నాడు. ఎవరు ప్రజలకు ఇబ్బంది కలిగించినా వదిలి పెట్టేది లేదు." అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సీఎస్ సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.





# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా.. చల్లా ధర్మారెడ్డి



బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. దామెర మండలంలోని ఊరుగొండ, వెంకటాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించారు.ఊరుగొండ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పైండ్ల శ్రీను తల్లి కమలమ్మ, వెంకటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీను తల్లి అమృతమ్మ కుటుంబసభ్యులను చల్లా ధర్మారెడ్డి కలిసి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబసభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలు అధైర్యపడవద్దని, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని చల్లా ధర్మారెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కునాటి సునీల్ రెడ్డి మాజీ సర్పంచ్ గోగులసత్యనారాయణ రెడ్డి దామెర పార్టీ అధ్యక్షుడు గండురామకృష్ణ, జాకీర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదంలో గాయపడిన మాజీ ఎంపిపిని పరామర్శించిన నాయకులు.



బయ్యారం మాజీ ఎంపీపీ కిషన్ నాయక్ తీజ్ పండుగ వేడుకలను ముగించుకొని తిరిగి ఇంటికీ వెళ్తుండగా బైక్ ప్రమాదంలో చేతికి గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిషన్ నాయక్ ని పలువురు సర్పంచులు,నాయకులు పరామర్శించారు.ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండే కిషన్ నాయక్ ప్రమాదానికి గురై హాస్పిటల్ లో చూసిన నాయకులు భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు కిషన్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వెంకట్రాంపురం సర్పంచ్ శివాజీ నాయక్,బాల్యతండా సర్పంచ్ దేవోజీ,నూద్దునూరి లింగయ్యగార్ల మాజీ ఎంపీపీ వెంకట్ లాల్,వార్డ్ మెంబర్ కేస సందీప్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## కొలంబియాను కుదిపేసిన భారీ భూకంపం.. 69 మంది మృతి

పశ్చిమ కొలంబియాలో సోమవారం సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైన ఈ భూప్రకంపనల కారణంగా 69 మందికి పైగా మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. అనేక భవనాలు పేకమేడల్లా కూలిపోవడంతో శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు.

# కర్రెగుటల్లో డీజీపీ పర్యటన  గణపతి దంపతులు లొంగిపోవాలి





ఆపరేషన్ కగార్ తో తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టిన భద్రతా బలగాల కృషి వమ్ము కాలేదు. నాడు కర్రెగుట్టల దండకారణ్యంలో తుపాకుల మోతలతో తూటాల వర్షం కురిసి రక్తమోడిన నేల నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో లొంగిన మావోయిస్టుల కంచుకోటలో నేడు అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. కాగా ఏప్రిల్ 7న కర్రెగుటలలోని సిఆర్పిఎఫ్ 39 పామూనురు బెటాలియన్ ను అప్పటి డిజిపి బి.శివధర్ రెడ్డి సందర్శించి మారుమూల ప్రాంతాల అభివృద్ధి నాంది పలికితే.. సోమవారం కర్రెగుట్టల పర్యటనకు వచ్చిన డీజీపీ సివి ఆనంద్ మరో అడుగు ముందుకు వేసి పామూనురు బెటాలియన్ ను దాటి చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28 కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి కర్రెగుటలలో శాశ్వత అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

**డీజీపి పర్యటన సాగిందిలా.**

డీజీపి గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కర్రేగుట్టల్లో ఆయన పర్యటించారు. ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్న డిజిపి జిల్లాలోనే బస చేసి సోమవారం ఉదయం పామునూరు 39 సిఆర్పిఎఫ్ బేస్ క్యాంపునకు చేరుకున్న ఆయన పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి నుంచి కర్రేగుట్టల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. అదీకాక పామునూరు, చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి అక్కడ జెండా ఎగురవేసి, శాంతికపోతాలని గాల్లోకి వదిలారు. ఈ క్రమంలో అక్కడ పనుల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పామునూరులో నివాసం ఉంటున్న గుత్తి కోయలకు బియ్యం, దుప్పట్లు అందజేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**కాకరాల సమత కి 20 లక్షల రూపాయల చెక్ అందజేత**

డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ మావోయిస్టుల అణచివేతలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేశామని తెలిపారు. మావోయిస్టుల కంచుకోటలుగా ఉన్న ప్రాంతాలను ఖాళీ చేయించామని, కొందరు ఎన్కౌంటర్లలో మృతి చెందగా ప్రభుత్వం తీసుకొచ్చిన పునరావాస విధానాలతో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందించామని తెలిపారు. అలాగే త్వరలోనే ఈ ప్రాంతం అరణ్య ప్రాంతమైనప్పటికీ అటవీశాఖతో కలిసి చూడదగ్గ ప్రదేశాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని డీజీపీ వెల్లడించారు.

**40 ఏళ్ల మావోయిస్టు జీవితం.. జనజీవన స్రవంతిలోకి**

దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో అండర్గ్రౌండ్లో కొనసాగిన సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగులో డీజీపి సీవీ ఆనంద్ విలేకరుల సమావేశంలో ఆమె నేపథ్యం, పార్టీ బాధ్యతలు, కుటుంబ వివరాలు, ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాలను వెల్లడించారు.

**1985లో అండర్గ్రౌండ్లోకి**

1985లో వైజాగ్ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలకు ప్రభావితమైన సమత అండర్గ్రౌండ్లోకి వెళ్లినట్లు డీపిజీ తెలిపారు. అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీకి పనిచేశారన్నారు. హైదరాబాద్ కమిటీలో సుమారు పదేళ్లు, నల్లమలలో నాలుగేళ్లు, ఉత్తరప్రదేశ్ ఏరియా కమిటీలో రెండేళ్లు, గుజరాత్ గోల్డెన్ కారిడార్ కమిటీ' లో రెండేళ్లు, మహారాష్ట్ర ఏరియా కమిటీలో ఐదేళ్లు, కర్ణాటక--మహారాష్ట్ర ఉమ్మడి కమిటీలో పదేళ్లు పనిచేసినట్లు వివరించారు.

**పార్టీ డాక్యుమెంటేషన్లో కీలక పాత్ర**

సమత సాయుధ కార్యకలాపాలతో పాటు పార్టీ సిద్ధాంతపరమైన, డాక్యుమెంటేషన్ బాధ్యతలు నిర్వహించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ తీర్మానాలు, పార్టీ పత్రాల రూపకల్పన, సిద్ధాంతపరమైన అంశాల రచన, అనువాదాలు, మహిళా సమస్యలపై వ్యాసాల రచన, క్యాడర్కు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు చేపట్టారన్నారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతికి సీసీ స్టాఫ్ మెంబర్గా కూడా పనిచేసినట్లు సమత వెల్లడించిందన్నారు.

**కుటుంబంలోనూ మావోయిస్టు నేపథ్యం**

సమత సోదరి కాకర్ల సునీత అలియాస్ బద్రి కూడా సీనియర్ మావోయిస్టు నాయకురాలిగా పనిచేసి గత ఏడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు డీజీపి తెలిపారు. మరో కజిన్ సోదరి కాకర్ల పద్మ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మావోయిస్టు కార్యకలాపాల్లో పనిచేసిందన్నారు. 2018లో అరెస్టయిన ఆమె ప్రస్తుతం బెయిల్పై చెన్నైలో ఉంటున్నట్లు వెల్లడించారు.సమత భర్త పటేల్ సుధాకర్రెడ్డి మావోయిస్టు పార్టీలో సీనియర్ క్యాడర్గా, మిలిటరీ కమిషన్, పార్టీ ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలకంగా పనిచేసినట్లు డీజీపి తెలిపారు. 2010లో జరిగిన ఎదురుకాల్పుల్లో సుధాకర్రెడ్డి మృతి చెందినట్లు చెప్పారు. అదీకాక మావోయిస్టుల పునరావాసంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని డిజిపి సీవీ ఆనంద్ తెలిపారు. సరెండర్ అయిన వారికి ఆర్థిక సాయం, సామాజికంగా స్థిరపడేందుకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ఉచిత వైద్య చికిత్స కోసం ఆరోగ్య రక్షణ కార్డులు జారీ చేసి పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అంతేకాక సరెండర్ అయిన వారు గౌరవప్రదంగా జీవించేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డిజిపి తెలిపారు. వృత్తి లేదా వ్యాపారం చేయాలనుకునే వారికి శిక్షణతో పాటు రుణాలు అందించి స్వయం ఉపాధికి సహకరిస్తామన్నారు. ఆరోగ్య, కేసులు లేదా ఇతర సమస్యలు ఉంటే పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. సరెండర్ అయిన వారిని పూర్తిగా జనజీవన స్రవంతిలో కలపడం పునరావాస విధానం లక్ష్యమన్నారు.

**23 మందికి రూ.2 కోట్ల వరకు సాయం**

పునరావాస విధానం కింద ఇప్పటికే 23 మంది సరెండర్ అయిన మావోయిస్టులకు దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ, పార్టీ మెంబర్ లేదా ఇతర క్యాడర్ అనే తేడా లేకుండా సరెండర్ తర్వాత సాధారణ జీవితంలో స్థిరపడేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు.

**గణపతి దంపతులకు పోలీసుల పిలుపు**

మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఆయన భార్యతో పాటు అండర్గ్రౌండ్లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు కార్యకలాపాలకు గతంలో కీలకంగా ఉన్న ప్రాంతం కావడంతో హైదరాబాద్కు బదులుగా ములుగులో కార్యక్రమం నిర్వహించినట్లు డిజిపి సివి ఆనంద్ తెలిపారు. తెలంగాణ--ఛత్తీస్గఢ్ మధ్య దట్టమైన అటవీ ప్రాంతం గతంలో మావోయిస్టు కార్యకలాపాలకు కారిడార్గా ఉండేదని, ఈ ప్రాంతంలో పర్యటించి సరెండర్ క్యాడర్తో నేరుగా మాట్లాడినట్లు చెప్పారు. వారి సమస్యలు, పునరావాస విధానంలోని లోపాలు, కేసుల సమస్యలను తెలుసుకున్నామని, అవసరమైతే కేంద్ర, ఛత్తీస్గఢ్ ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.

**హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలి**

మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచి సమాజంలో కలిసిపోవాలని డిజిపి సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. సరెండర్ అయిన వారు తిరిగి అండర్గ్రౌండ్ బాట పట్టకుండా కుటుంబాలతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడిపేలా చేయడమే ప్రభుత్వ పునరావాస విధానం లక్ష్యమన్నారు.

"సరెండర్ అయిన వారికి ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉపాధి, శిక్షణ, రుణాలు, ఆరోగ్య సమస్యలకు వైద్య సాయం అందిస్తాం. వారు సాధారణ పౌరులుగా జీవించాలన్నదే మా ప్రధాన ఉద్దేశం" అని తెలిపారు. కర్రెగుట్టలో పర్యటనలో డీజీపీ సీవి ఆనంద్ తో పాటు మల్టీజెన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝూ, సిఆర్పిఎఫ్ ఎడిజి విక్రమ్ సింగ్, ఇంటెలిజెన్స్ ఎస్పి సింధు శర్మ, ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనా, ఏ ఎస్ పి మనన్ భట్ ఐపిఎస్ తదితరులు పాల్గొన్నారు.





# ఎలిశెట్టి పల్లి వంతెన, దేవాదుల నీరు మైదాన ప్రాంతానికి తరలింపు,

# మంత్రి మాయ మాటలు నమ్మకండి

ములుగు జిల్లా కేంద్రం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా,, జాడి రామరాజు నేత పత్రిక ప్రకటన విడుదల చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఇలా పేర్కొన్నారు. ములుగు నియోజకవర్గ ఏజెన్సీ మండలాలలోని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడుతామని హామీలు ఇచ్చిన ఎమ్మెల్యే సీతక్క మంత్రి అయ్యాక చేసిందేమీ లేదని అన్నారు అంతేకాకుండా ఏటా వరదలకు రహదారులు మూసుకుపోతున్న గ్రామం ఎలిసెట్టి పల్లి గ్రామం ఆ గ్రామానికి వంతెన వేయకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్ద రాత్రి 10 గంటలకు వెళ్లి గ్రామ ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ వీడియోలు తీయించి పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సాధించింది ఏమిటని ప్రశ్నించారు. అదీకాక గత 22 సంత్సరాల నుండి గెలిస్తే ఎలిశెట్టిపల్లి బ్రిడ్జీ నిర్మిస్తానని చెప్పి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాద్యతలు తీసుకున్నప్పటికిని ఇంత వరకు ఎందుకునవంతెన పనులు ప్రారంబించలేదన్నారు. ఇంకా 2004, నుండి 2026 వరకు పూటకో పార్టీ రోజుకో మాట చెప్పుకుంటూ 22 సంత్సరాలు పూర్తి చేసుకొని చరిత్ర సృటించరాన్నారు. నాడు ఎమ్మెల్యే గా ఉండగా నేడు మంత్రిగా కూడా ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం వలనేఎలిశెట్టి వాగును బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జహర్ లాల్ అజ్మీరా కృష్ణవేణి నాయక్ తో పాటు బీజేపీ నాయకులు ఎలిశెట్టిపల్లి ప్రాంతం వెళ్లి ప్రజలను కలిసి వాగును సందర్శించడం జరిగిందన్నారు. కాగా బీజేపీ పర్యటన ను చూసిన మంత్రి జెండాలు మోసి జేజేలు కొట్టి పాలాభిషేఖం చేసే నాయకులకు ఆదేశాలు జారీ చేసి అర్ద రాత్రి 10గంటల తర్వాత నిద్రించే వాళ్ళను భయబ్రాంతులకు గురి చేసే వీడియోలు చేపించి సాధించిందేమిటో మంత్రి చెప్పాలన్నారు. అదేవి దంగా కేంద్ర ప్రభుత్వం ఎలిశెట్టి వాగుపై బ్రిడ్జి నిర్మాణం



కోసం 21 కోట్ల రూపాయలు ఇస్తుంటే రాష్ట్రప్రభుత్వం కేవలం 5కోట్ల రూపాయలు మాత్రమే ఇస్తుంది 3 నెలలకు సరిపడా కేంద్ర ప్రభుత్వం 30కేజీల బియ్యం ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 5 కేజీల బియ్యం మాత్రమే అన్నారు. అదేవిదంగా 2009 నుండి 2014 వరకు ఎమ్మెల్యే గా5సంత్సరాలు పదవి పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం కు నాటి ప్రభుత్వం కు కనీసం ఎలిశెట్టి పల్లి వాగు పై బ్రిడ్జి కోసం ప్రతిపాదన కూడా పంపలేదుకాబట్టే 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు కానీ తర్వాత 2018 ఎన్నికల్లో ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ వర్గాల ప్రజలు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు నమ్మి ఓట్లు వేసి 2వ సారి ఎమ్మెల్యే ను చేస్తే 1912 ఏప్రిల్ 15అర్ధరాత్రి జరిగిన అట్లాటిక్ మహాసంద్రం లో జరిగిన టైటానిక్ పడవ ప్రమాదం ను 2022జులై 21 ఎలిశెట్టి పల్లి వాగు లో పడవ ప్రమాదం లో ఉడుగు చెట్టు కు తగిలించి చూపించావన్నారు. దీంతో నాడు ఎలిశెట్టి పల్లి బ్రిడ్జి తో పాటు తాడ్వాయి, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలం లో ఉన్న సమస్యలు గుర్తు చేసుకుంటూ ప్రజలను నమ్మిస్తూ ఎమ్మెల్యే గా రెండవ సారి ఎన్నికైన తర్వాత కొండాయి బ్రిడ్జి కింద మంత్రి అనుసార్ల ఆర్థిక పోరాటం చేస్తూ బ్రిడ్జి పక్కపొట్టి ఇసిక తియ్యడం తో 6కోట్ల తో నిర్మాణం చేసిన బ్రిడ్జి 6సంత్సరాలు లేకుండా చెయ్యడమే కాకుండా 8మంది మరణాలకు కారణం అయ్యిందన్నారు. అదేవిదంగా 2022జులై లో నాటి తెలంగాణ ముఖ్య మంత్రి కెసిఆర్ ఏటూరునాగారం కు ఏమికావాలో కోరుకొమ్మాని నాటి ఎమ్మెల్యే నేటి మంత్రి ని అడుగుతే 9000వేల జనాభా కలిగిన ములుగు మున్సిపాలిటీ ములుగు బస్సు డిపో కావాలని కోరింది కానీ 20334 మంది జనాభా కలిగిన ఏటూరునాగారం మున్సిపాలిటీ కావాలని కోరలేదు ఏటూరునాగారం బస్సు డిపో పునర్ నిర్మాణం చెయ్యాలని కొరకుండా ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి ని అడ్డుకుంటూ రాక్షసానందం పొందుతున్న మంత్రి కి ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజలు డిపాజిట్ రాకుండా చెయ్యాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత అన్నారు.

## కార్మిక వ్యతిరేక విదేశి ఒప్పందాలు విరమించుకోవాలి



రైతులు కార్మికులు తిరగబడితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి సోమ మల్లారెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత సంయుక్త సంఘాల జైల్ బరో పిలుపులో భాగంగా సీఐటీయు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిం చారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు . కార్మిక హక్కులను కాలరాస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పోడగించిందన్నారు. అదీకాక కనీస వేతన చట్టాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. కాగా ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. .దీని ద్వారా కార్మికులకి సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. అంతేకాక అంబానీ ఆదానీలకు లక్షల కోట్ల దోచిపెట్టె జేబు సంస్థలుగా బీజేపీ ప్రభుత్వం మారిందని విమర్శించారు. దీంతో జీరో టారిఫ్ తో అమెరికాతో చేసుకున్న వ్యవసాయ దిగుమతి ఒప్పందాల వలన భారత రైతాంగానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఇప్పటికే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న విధానం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఐతే గ్రామీణ ప్రాంత పేదలకు ఎంతో ఉపయోగంగా ఉండే ఉపాధి పథకాన్ని రద్దుచేసి వీబీజీ రామ్ బిల్లును తీసుకురావడం వలన పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అలాగే వెంటనే వీబీజీ రాంజీ చట్టాన్ని రద్దుచేసి దాన్ని స్థానంలో పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్య క్షుడు పొదిల్లా చిట్టిబాబు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తీగల ఆగిరెడ్డి, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల మురళి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు ధనలక్ష్మి, భాగ్య లక్ష్మి, పి సరిత, అరుంధతి, పద్మావతి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి గరుగు ఐలయ్య, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొట్టె కృష్ణారావు, కడారి నాగరాజు, పల్లపు రాజు, గుండు రామస్వామి, గుండు లెనిన్, కాప కోటేశ్వరరావు, కన్నోజు సదానందం, మోటెం సాంబయ్య, జంపాల అనిల్, పురుషోత్తం రెడ్డి, అశోక్, బ్రహ్మాచారి, సువర్ణ, సులోచన, శ్రీనివాస్ రెడ్డి,కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు రహిత ప్రాంతంగా కర్రెగుట్టలు డీజీపీ సీవీ ఆనంద్

కర్రెగుట్టల ప్రాంతాన్ని మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం వెంకటాపురం పోలీస్ సర్కిల్ పరిధిలోని పామునూరు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపును ఆయన సందర్శించారు. పామునూరు నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కర్రెగుట్టల్లో పోలీసు జెండాను ఎగురవేసి, శాంతికి ప్రతీకగా పావురాలను ఎగురవేశారు. దాదాపు 50–60 ఏళ్లుగా మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ఈ ప్రాంతంలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. దీంతో



పామునూరు – ఛత్తీస్‌గఢ్ రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజా రవాణాకు అనుకూలంగా తీర్చిదిద్దుతామని, భవిష్యత్తులో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే పామునూరు గ్రామస్థులకు నిత్యావసర సరుకులు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఆదివాసీలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని పేర్కొన్న డీజీపీ మావోయిస్టు కార్యకలాపాల్లో ఉన్నవారు లొంగిపోవాలని, వారికి ప్రభుత్వం పునరావాసం, అవసరమైన సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, సీఆర్పీఎఫ్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



# లాఠీలు, తూటాలు ప్రజా పోరాటాలను ఆపలేవు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా చేపట్టిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్‌లో సోమవారం ఆందోళన ఉధృతంగా సాగింది. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తల మధ్య కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది.

ఈ ఘటనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాదుల శ్రీనివాస్తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక, కర్షక, రైతాంగ హక్కుల కోసం చేపడుతున్న ప్రజా పోరాటాలను లాఠీలు, తూటాలు, అరెస్టులతో అణచివేయలేరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని, ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. విత్తన చట్టానికి సంబంధించిన ప్రతిపాదనలను రద్దు చేయడంతో పాటు విద్యుత్ సంస్కరణలను వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రోజువారీ పని సమయాన్ని ఎనిమిది గంటల నుంచి 12 గంటలకు పెంచుకునేలా యాజమాన్యాలకు స్వేచ్ఛ కల్పించే విధానాలను వ్యతిరేకించారు. కార్మికుల సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్మిక, కర్షక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ప్రజా పోరాటాలు ఆగవని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మండలం, పట్టణానికి చెందిన పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డేలా రామ్మూర్తి, చేపూరి గణేష్, సుధాకర్, సురేష్, నరసింహారావు, ఖాదర్ బాబాతో పాటు పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com